నేటి నిజం

website2:www.netinijam.com

హైదరాబాద్ మంగళవారం 5-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:99 పేజీలు:6 వెల: రూ.1/-

## ఇంటెలిజెన్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ రావు రాజీనామా

హైదరాబాద్, డిసెంబర్ 4: తెలంగాణలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (గాఎః) లోగల యాంటీ నక్సల్ ఇంటెలిజెన్స్ విభాగానికి ప్రత్యేక అధికారి (గాఆ) గా ఉన్న మాజీ ఐపీఎస్ ఆఫీసర్ టీ ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేశారు. సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడు అయిన ప్రభాకర్ రావు మూడేళ్ల క్రితం పదవీ విరమణ చేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ ఓఎస్‌డీగా కొనసాగుతున్నారు.

కొంత కాలం క్రితం ఓఎస్‌డీ ప్రభాకర్ రావుపై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్‌లను టాప్ చేస్తున్నారని ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత తీవ్ర పరిణామాలను అనుభవిస్తావని ప్రభాకర్ రావును హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడంతో పదవికి రాజీనామా చేశారు.

ఇప్పటికే ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ డీ ప్రభాకర్ రావు కూడా తన పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి కూడా తన పదవి నుంచి వైదొలిగారు.

# ఏపీ కోస్తాలో కడలి కల్లోలం..గజగజ వణకుతున్న తీరప్రాంతాలు



-మైచాంగ్ పడగలో కోస్తా బిక్కు బిక్కు
-హోరు గాలి భారీ వర్షం
--బందరు, కాకినాడ మధ్య తుపాను తిష్ట
చినగొల్లపాలెంలో తీరం దాటే చాన్స్
-తమిళనాడు అప్రమత్తం.. స్కూళ్లకు సెలవు
-ఎయిర్‌పోర్టులోనే ఆగిపోయిన విమానాలు

అమరావతి, డిసెంబర్ 4:ఆంధ్రప్రదేశ్ తీరంపై మైచాంగ్ పడగ విప్పింది. కడలి కోరలతో దూసుకువస్తోంది. ఇటు కుంభవృష్టి, మరో వైపు విపరీత చలిలో తీరప్రాంతం గజ గజలాడుతోంది. 100 కిలోమీటర్ల వేగంతో హోరు గాలి వీస్తుంటే, అలలు విరుచుకు పడుతున్నాయి. మూడు రోజుల ముందే అధికారులు అప్రమత్తం అయ్యారు. తీరప్రాంతంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, విజయవాడ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉరుములు.. మెరుపులతో జడివాన అల్లాడిస్తోంది. ఈ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్‌ని వాతావరణ శాఖ ప్రకటించింది. పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తెల్లవారుజామున 3.00 గంటల నుంచి భారీ వాన ప్రారంభమైంది. ఇక.. అటు తమిళనాడులోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలకు ప్రభుత్వం సెలవులిచ్చింది. వాన దాటికి విమానరాకపోకలకు అంతరాయం కలిగింది. మద్రాస్ ఎయిర్ పోర్టులోనే విమానాలన్నీ నిలిచి పోయాయి.

### కృష్ణాజిల్లాలో కల్లోలం

సోమవారం తెల్లవారుజాము నుంచే కృష్ణా జిల్లా వ్యాప్తంగాభారీ వర్షం కురుస్తుంది. తీరం వెంబడి గంటకు 55నుంచి -75కిలోమీటర్ల వేగంతో హోరు గాలి వీస్తోంది. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెంలో మంగళవారం మధ్యాహ్నం తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపాన్ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్త మయ్యాయి, . సముద్రంలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. అలల ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. సముద్రం కొన్ని ప్రాంతాల్లో ముందుకు వచ్చింది . కృష్ణాజిల్లా తీర ప్రాంతంలోపది మీటర్ల ఎత్తున సముద్ర పు అలలు ఎగిసిపడుతున్నాయి. ,దివిసీమలో కోడూరు, నాగాయలంక మండలాల్లో నిఉంటగుణం, రామకృష్ణ పురం, పాలకాయతిప్ప, బసన్నపాలెం ,ఇరాలి, చింతకోళ్ళ ,ఎదురు మెండి, ఎల్లిచెట్లదిబ్బ ,సోర్లగోంది, నాలి ,సంగమేశ్వరం , కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం, మచిలీపట్నం మండలం పెదపట్నం, మంగినపూడి, పోలాటి తిప్ప,గ్రామాల్లో ని తీర ప్రాంత ప్రజలుబిక్కు బిక్కు మంటున్నారు. అధికారుల సమాచారంతో మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు. జిల్లాలో 7 మండలాల్లోని 51 గ్రామాల్లో 57 పునరావాస కేంద్రాల ఏర్పాటు చేశారు. ఈ పునరావస కేంద్రాలకు 1,814 మందిని తరలించారు. మరో 7,763 మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ అప్రమత్తం చేస్తున్నారు.

### బాపట్లలో భయం భయం

బాపట్ల జిల్లా బాపట్ల , రేపల్లె,చీరాలనిజాంపట్నం ప్రాంతాల్లో ఎన్డీఅర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. 18 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తీరప్రాంతానికి చేరుకున్నాయి. మరో 18 బృందాలు బాపట్లకు చేరుకుంటాయి. తీర ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ తుపాన్ పునరావాస కేంద్రాలకు రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులు తరలిస్తున్నారు. ప్రజలకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల సూర్యలంక సముద్రతీరం తుఫాన్ షెల్టర్లలో తీర ప్రాంత ప్రజలకు వసతి కల్పించారు. తుపాన్ ప్రభావంతో సముద్రంలో వేటనిషేధించి నల్లమడకాలవబోట్లు నిలిపివేశారు.

### కాకినాడలో ఆరెంజ్ అలర్ట్

కాకినాడ జిల్లాలో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు బీచ్ రోడ్డును తాకుతున్నాయి. సముద్రం లోపల అల్లకల్లోల పరిస్థితితో కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులను అధికారులు నిలిపివేశారు. దాదాపు పదికి పైగా విదేశీ నౌఖలు నిలిచిపోయాయి. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లరాదని, వేటకెళ్లిన వారిని తక్షణమే వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేయాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు . నెల్లూరు, కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, శ్రీసత్యసాయి, నంద్యాల, కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, మిగతా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

### తిరుపతిలో భారీ వర్షం .. ఓ చిన్నారి మృతి

పెను తుపాన్‌గా ఆవిర్భవించిన మైచాంగ్ ప్రభావంతో తిరుపతి జిల్లాలోని భారీ వర్షం కురుస్తోంది. పుణ్యక్షేత్రం తిరుపతిలో భక్తులు చలితో వణికిపోతున్నారు. ఏర్పాడు మండలం చిందేపల్లి ఎస్టీ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడు యశ్వంత్ మరణించినట్లు తెలుస్తోంది. ఇక నెల్లూరు, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. గత శనివారం నుంచీ ఏకధాటిగా ఈ చిత్తూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

### విశాఖ నుంచి ఫ్లైట్ క్యాన్సిల్

మైచాంగ్ తుఫానుతో విశాఖపట్నంలో విమాన సర్వీసులను రద్దు చేశారు.. విజయవాడ నుంచి మంగళవారం ఉదయం 9.00 గంటలకు విశాఖకు చేర్చాల్సిన ఇండిగో సర్వీస్ ను రద్దు చేశారు. విశాఖ నుంచి తిరుపతి వెళ్లాల్సిన సర్వీసును, చెన్నై నుంచి విశాఖకు చేరాల్సిన సర్వీసును, మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి విశాఖ రావలసిన విమానం సర్వీసును రద్దు చేశారు.

### తమిళనాడు గజగజ

మైచాంగ్ తుఫానుతో తమిళనాడు గజగజ వణుకుతోంది. వారం రోజుల కిందటే భారీ వర్షాలతో తల్లడిల్లింది. ప్రస్తుతం ఏపీలో కేంద్రీకృతమైన తుపాను ప్రభావాన్ని అంచనా వేసిన తమిళనాడు ప్రభుత్వం .. తమ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించింది. పుదుచ్చేరీ కరైకల్ కలై సెల్వీ, కాంచీపురం, చెన్నై, చెంగల్పట్, తిరువల్లూరు ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేశారు.

### ఏపీ ప్రభుత్వం అప్రమత్తం

మైచాంగ్ తుపాను ప్రభావంపై ఏపీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖ నుంచి నెల్లూరు జిల్లా వరకూ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల, కృష్ణా, ఏలూరు, భీమవరం, కాకినాడ జిల్లాల్లో పునరావాసం కోసం జిల్లాకు రూ.కోటి లు చొప్పున విడుదల చేసింది. ఆయా జిల్లాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయటమే కాదు, బాధితులను తుపాను పునరవాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. సహాయక శిబిరాల్లో సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోండిఆ హారం,తాగునీరు, మందుల సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండితుపానుతో దెబ్బతినే వ్యవస్థలను యుద్ధప్రాతిపదికనపునరుద్ధరించాలి . కల్లాల్లో ధాన్యం తడిసిపోకుండా ప్రత్యేక చర్యలు తేమలాంటి సాంకేతిక అంశాలను పక్కనపెట్టి రైతుల వద్ద ధాన్యాన్ని సేకరించాలి-కలెక్టర్లకు సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతాన్ని చూడకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.'ధాన్యంలో తేమ శాతం పట్టించుకోవద్దు. ధాన్యం సేకరించి వెంటనే మిల్లులకు తరలించాలి. 7,20 లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయాలి. సదరు జిల్లాల్లో డ్రయర్లు లేకుంటే పొరుగు జిల్లాలకు పంపాలి. అందుకయ్యే రవాణా ఖర్చులనూ భరించాలి' అని స్పష్టం చేశారు

# బద్దలైన అగ్నిపర్వతం..

## 11 మంది పర్వతారోహకులు మృతి



న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఇండోనేషియాలోని పశ్చిమ ప్రాంతంలో ఓ అగ్నిపర్వతం బద్దలైంది. సుమత్రా దీవిలో మౌంట్ మరపిలో ఉన్న అగ్నిపర్వతం విస్ఫోటనం చెందింది.

ఈ ఘటనలో 11 మంది పర్వతారోహకులు మృతి చెందారు. మరో 12 మంది ఆచూకీ గల్లంతైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో.. బూడిద ఆకాశంలో మూడు వేల మీటర్ల ఎత్తుకు వ్యాపించింది.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. అగ్ని పర్వతం విస్ఫోటనం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో మొత్తం 75 మంది పర్వతారోహకులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిలో 11 మంది మరణించినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 49 మందికి కాపాడామని.. మరో 12 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని వివరించారు. ప్రస్తుతం గల్లంతైన వారి ఆచూకీ కోసం ఆ ప్రాంతంలో తీవ్రంగా గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఘటన తీవ్రత నేపథ్యంలో మౌంట్ మరపి ప్రాంతంలో అధికారులు అలర్ట్ ప్రకటించారు. అక్కడ రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

# కార్పొరేషన్ చైర్మన్ల పదవులకు నేతల రాజీనామా.. సీఎస్‌కు లేఖలు..!

హైదరాబాద్, డిసెంబర్ 4:। రాష్ట్రంలోని పలు కార్పొరేషన్ల చైర్మన్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో పనిచేస్తామని ప్రకటించారు.

### రాజీనామా చేసింది వీళ్లే..

బోయినపల్లి వినోద్ కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు

సోమా భరత్‌కుమార్, రాష్ట్ర డెయిలీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్

జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్

దూదిమెట్ల బాలరాజు, గొర్రెలు, మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్

రవీందర్‌సింగ్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్

కే వాసుదేవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్,

మన్నె క్రిశాంక్, టీఎస్ఎండీసీ చైర్మన్

గెల్లు శ్రీనివాస్, పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్

పల్లె రవికుమార్, గీతవృత్తిదారుల సహకార సంస్థ చైర్మన్

పాటిమీద జగన్‌మోహన్‌రావు, టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్

అనిల్ కూర్మాచలం, ఫిలిం డెవల్‌పెమంట్‌కార్పొరేషన్ చైర్మన్

గజ్జెల నగేశ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

మేడే రాజీవ్‌సాగర్, టీఎస్‌ఫుడ్స్ చైర్మన్

ఆంజనేయగౌడ్, శాక్స్ చైర్మన్

వై సతీశ్‌రెడ్డి, రెడ్‌కో చైర్మన్

రామచంద్రనాయక్, ట్రైకార్ చైర్మన్

గూడూరు ప్రవీణ్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్

వాల్యానాయక్, జీసీసీ చైర్మన్

# శీతాకాలం ఆలస్యమైనా.. రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 4: చలి కాలం బహుశా ఆలస్యం గా రావడమే కాకుండా మనలను చాలా నెమ్మదిగా సమీపిస్తున్నది, అయితే రాజకీయ వేడిమి చాలా వేగం గా పెరుగుతూ ఉన్నది. నిన్నటి రోజున నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాయి. మరి ఫలితాలు ఎంతో ప్రోత్సాహకరం గానూ ఉన్నాయి.

సామాన్య మానవుడి శ్రేయం కోసం కట్టుబడిన వారందరి కీ మరియు దేశం యొక్క ఉజ్వలమైన భవిష్యత్తు కు అంకితం అయినవారికి, ప్రత్యేకించి అన్ని సమాజాల లో అన్ని వర్గాల వారి కి; ప్రతి ఒక్క గ్రామం, ఇంకా నగరం లో మహిళల కు; ప్రతి ఒక్క గ్రామం మరియు నగరాల లో అన్ని సామాజిక సమూహాల వరకు; రైతులు మొదలుకొని ప్రతి ఒక్క సముదాయం వరకు; ఇంకా నా దేశం లో పేద ప్రజల కు ఈ ఫలితాలు ప్రోత్సాహకరం గా ఉన్నాయి. ఈ నాలుగు ముఖ్యమైన కులాల కు సాధికారిత ను కల్పించాలి అనే సిద్ధాంతాన్ని అనుసరించేటటువంటి వారికి మరియు వారి యొక్క ప్రకాశవంతమైనటువంటి భవిష్యత్తు కు పూచీ పడే వారికి, మరి అలాగే నిర్దిష్ట ప్రణాళికల ను చివరి మజిలీ వరకు తీసుకుపోయేటటువంటి వారి కి బలమైన సమర్దన లభించింది. ప్రజల సంక్షేమం కోసం సుపరిపాలన మరియు నిరంతరాయమైనటువంటి సమర్దన ఉన్నట్లయితే కనుక 'పాలకపక్ష-వ్యతిరేకత' అనే పదం అర్ధరహితం అవుతుంది. కొంత మంది దీనిని అధికార పక్ష సానుకూలత, సుపరిపాలన, పారదర్శకత్వం, దేశ విశాల హితం, లేదా సార్వజనిక సంక్షేమాని కి ఘనమైనటువంటి ప్రణాళికలు అని పేర్కొనవచ్చును, అయితే ఇది ఎటువంటి ఒక అనుభూతి అంటే దీనిని మనం నిరంతరం గా గమనించుకొంటూ వస్తున్నాం. మరి, ఈ రోజున మనం అటువంటి అద్భుతమైన ప్రజాతీర్పు తరువాత, ఈ పార్లమెంటు తాలూకు క్రొత్త దేవాలయం లో సమావేశమవుతున్నాం.

పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించినప్పుడు కొద్ది కాలం పాటే సమావేశాలు సాగాయి, అయితే ఆ సమావేశాలు ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం రూపుదాల్చింది. ఏమైనా ఈ సారి దీర్ఘకాలం పాటు ఈ భవనం లో పని చేసేందుకు ఒక అవకాశం దక్కుతుంది. ఇది ఒక నూతనమైన భవనం, ఈ కారణం గా ఏర్పాటుల లో కొన్ని లోటుపాటు లు ఉంటే ఉండవచ్చును. ఏమైనా, ఇది సాధారణం గా పని చేయడం ప్రారంభించినప్పుడు పార్లమెంటు సభ్యులు, సందర్శకులు మరియు ప్రసార మాధ్యాల సిబ్బంది ఈ లోటుపాటుల ను కూడా గమనించి, మరి వాటి విషయం లో తగిన జాగ్రతల ను తీసుకొనేందుకు వీలు ఉంది. గౌరవనీయులైన ఉప రాష్ట్రపతి మరియు మాన్య స్పీకర్ లు ఈ అంశాల విషయం లో పూర్తి గా జాగరూకులై ఉంటారన్న నమ్మకం నాలో ఉంది. మీ దృష్టి కి వచ్చిన చిన్న చిన్న అంశాలు ఏవైనా ఉంటే వాటి ని ప్రస్తావించండి అని నేను కూడా మీకు సూచిస్తున్నాను. ఈ అంశాల ను (కొత్త పార్లమెంట్ భవనం) పట్టి చూపించడం జరిగినప్పుడు అవసరాల కు అనుగుణం గా మార్పుల ను చేసుకోవలసి ఉంటుంది కూడాను.దేశం వ్యతిరేక ఆలోచనల ను త్రోసిపుచ్చింది. సమావేశాలు ఆరంభం అయ్యే ప్రతి సారి ప్రతిపక్షాలకు చెందిన సహచరుల తో మా చర్చలు నిరంతరాయం గా సాగిస్తూ ఉంటాం. మా ప్రధాన జట్టు వారితో చర్చించి మరి ప్రతి ఒక్కరి సహకారం కోసం విజ్ఞప్తి చేస్తూ ఉంటుంది. ఈ సారి కూడా ఈ రకమైన అన్ని ప్రక్రియల ను అనుసరించడం జరిగింది. మీ ద్వారా, మన పార్లమెంటు సభ్యులు అందరికి కూడాను నేను బాహాటంగా విన్నవించ౦డం ఏమిటి అంటే అది ప్రజల ఆకాంక్షల ను నెరవేర్చేటటువంటి ఒక 'వికసిత్ భారత్' యొక్క పునాది ని బలపరచడాని కి ఒక ముఖ్య వేదిక ఈ ప్రజాస్వామ్య దేవాలయం అనేదే.

పూర్తి స్థాయి లో సన్నద్ధం అవ్వాలి, సభ లో సమర్పించే ఎటువంటి బిల్లుల పైన అయినా క్షుణ్ణం గా చర్చించాలి, మరి ఉత్తమమైనటువంటి సూచల ను అందించాలి అని . గౌరవనీయ ఎంపీలు అందరికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలా ఎందుకంటే, పార్లమెంటు సభ్యులు ఏదైనా సలహా ను ఇచ్చారంటే అందులో ఆచరణీయమైన అనుభవం తాలూకు మూలాలు ఉండి ఉంటాయి అన్న మాటే. అయితే, ఎటువంటి చర్చా జరగకపోతే దేశం ఆయా అంశాల తాలూకు లోటు ను ఎదుర్కొంటుంది, మరి ఈ కారణం గా నేను మరొక్క సారి (గంభీరమైనటువంటి చర్చల కు గాను సభ్యులు అందరికి) విన్నపాన్ని చేస్తున్నాను.

తాజా ఎన్నికల ఫలితాల ఆధారం గా, నేను ప్రతిపక్ష సహచరుల కు వారి ముందు ఒక సువర్ణావకాశం ఉంది అని చెప్పదలచుకొన్నాను. (అసెంబ్లీ ఎన్నికల లో) ఓటమి ని గురించిన నిరుత్సాహాన్ని ఈ సమావేశాల లో వెలిగక్కేందుకు ప్రణాళికల ను రచించుకోవడాని కి బదులుగా వారు ఈ ఓటమి నుండి పాఠాన్ని నేర్చుకొనే వ్యతిరేకత తాలూకు ఆలోచన ను విడిచిపెట్టి ముందుకు సాగాలి అన్నదే. అదే జరిగితే వారి విషయం లో దేశ ప్రజల దృష్టి కోణం లో మార్పు చోటు చేసుకొంటుంది. వారి కి ఒక క్రొత్త తలుపు తెరుచుకొనేందుకు అవకాశం ఉంటుంది... మరి ప్రతిపక్షం లో ఉన్న వారు అయినప్పటికీ కూడా సానుకూలమైన ఆలోచనల తో ముందుకు రావలసింది గా వారికి ఒక మంచి సలహాల ను నేను ఇస్తున్నాను. రండి, మేం పది అడుగులు వేస్తే అప్పుడు మీరు నిర్ణయాలు తీసుకొనేటప్పుడు పన్నెండు అడుగులు ముందుకు వేయండి.ప్రతి ఒక్కరికి భవిష్యత్తు ఉజ్వలం గా ఉంది; నిరాశ చెందవలసిన అగత్యం లేదు, కానీ దయచేసి ఓటమి తాలూకు ఆశాభావాన్ని సభ లో బయట పెట్టకండి. నైరాశ్యం ఉంటే ఉండవచ్చును, మీ యొక్క సహచరులు వారి బలాన్ని చాటడానికి ఏదైనా చేయవలసి రావచ్చును.

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస..

## తెగల మధ్య ఘర్షణలో 13 మంది మృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. టెంగ్‌నౌపాల్ జిల్లా సైబాల్ సమీపంలోని లీతూ గ్రామంలో రెండు తెగలకు చెందిన జనం మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. తుపాకులతో కాల్చుకున్నారు. ఈ ఘర్షణల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణలు జరుగుతున్నట్లు సమాచారం అందగానే తాము ఘటనా ప్రాంతానికి వెళ్లామని, అప్పటికే అక్కడ 13 మృతదేహాలు పడి ఉన్నాయని భద్రతాధికారులు తెలిపారు.

అయితే, ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లీతూ గ్రామానికి చెందిన వారు కాదని అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది. వేరే ప్రాంతం నుంచి వచ్చిన ఈ గ్రూప్.. గ్రామంలోని మరో తెగకు చెందిన గ్రూప్‌తో ఘర్షణకు దిగిందని భద్రతాధికారులు చెప్తున్నారు. స్థానికులు కాకపోవడంతో మరణించిన 13 మంది ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కాగా, ఈ ఏడాది మే 3న మణిపూర్‌లోని మైతీ, కూకీ తెగల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు కొన్ని నెలలపాటు కొనసాగాయి. ఈ హింసాత్మక ఘటనల్లో మొత్తం 182 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 50 వేల మంది నివాసాలను కోల్పోయారు. ఈ ఘర్షణల కట్టడి కోసం ఆ రాష్ట్రంలో భారీగా బలగాలను మోహరించారు. ఇంటర్నెట్ సేవలపై కూడా నిషేధం విధించారు.

ఇటీవలే పరిస్థితి అదుపులోకి రావడంతో ఆదివారమే ఇంటర్నెట్ సేవలను తిరిగి పునరుద్ధరించారు. ఇంతలోనే మళ్లీ తెగల నడుమ ఘర్షణలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

### నేటి కందం- నేటికీ అందం

నేల దినోత్సవ మందున
కాలమ్మున కెదురు నిలచి ఖ్యాతిని గూర్పన్
లీలగ మనలను గాచెడి
నేలను ప్రేమించ వలయు నిండు మనముతోన్ ?
( డిసెంబరు 5 ప్రపంచ నేల దినోత్సవం )



-రాధశ్రీ
సెల్:9494481210



# స్వచ్ఛంద సేవల్లో దైవాన్ని దర్శించలేమా..!

## (05 డిసెంబర్ "అంతర్జాతీయ వాలంటీర్ల దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛంద సేవకులు తమ ఉత్తమ నైపుణ్యాలను, అపార విజ్ఞానాన్ని, అపూర్వ అనుభవాలను, అమూల్య సమయాన్ని వెచ్చించి మానవ జీవన సరళికి, సమగ్ర సమాజాభివృద్ధికి ఎంతగానో తపన పడుతున్నారు. విశ్వవ్యాప్తంగా విస్తరించి ఉన్న స్వచ్ఛంద కార్యకర్తల నిస్వార్థ సేవలను గుర్తించిన ఐరాస 1985లో తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 05 డిసెంబర్‌న "అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినం" పాటించనట ఆనవాయితీగా మారింది.

### అంతర్జాతీయ వాలంటీర్ల దినం-2023 నినాదం:

ప్రపంచాభివృద్ధి లక్ష్యాల సాధనకు వాలంటీర్ల పాత్రను గమనించి వారి కృషిని ప్రోత్సహించడం, శాంతి స్థాపనలో వారి చేయూతను అందుకోవడానికి, స్వచ్ఛంద కార్యకర్తలను కృతజ్ఞతా భావంతో సత్కరించుకోవడానికి ఈ వేదికను వినియోగిస్తారు. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న పలు విపత్తులు, సంక్షోభాలు, సవాళ్ల సమయంలో వాలంటీర్ల సేవలు అనన్యసామాన్యమే కాదు అభినందనీయం కూడా. కరోనా విపత్తు కల్లోల సమయాన వైద్య సిబ్బంది, ప్రభుత్వ యంత్రాంగం, పారిశుధ్య సిబ్బంది, పోలీస్ యంత్రాంగం ప్రాణాలకు తెగించి విశ్వ మానవాళికి సేవలు అందించారు. అంతర్జాతీయ వాలంటీర్ల దినం-2023 నినాదంగా "సమిష్టి చర్యలు మహా శక్తివంతం (ది పవర్ ఆఫ్ కలెక్టివ్ ఆక్షన్)" అనే అంశాన్ని తీసుకున్నారు.

### అంతర్జాతీయ స్థాయి స్వచ్ఛంద సేవా సంస్థలు:

ప్రపంచవ్యాప్తంగా 109 మిలియన్ల వాలంటీర్లు అనునిత్యం సేవలు అందిస్తూనే ఉన్నారు. ఐరాస వాలంటీర్లలో 51 శాతం మహిళలు, 29 శాతం యువత ఉన్నారు. సంక్షోభ సమయాలు, ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర వేళల్లో అందరి కన్న ముందు వాలంటీర్లు చేరి, తమ జీవితాలను పణంగా పెట్టి మానవీయతను ప్రదర్శించుట ప్రశంసనీయం. అంతర్జాతీయ రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్బులు, రోటరీ క్లబ్బులు, పలు స్వచ్ఛంద సంస్థలు వెలకట్టలేని సేవలను అందిస్తున్నారు. పేదరికం వేళ్లూనిన భారత్ లాంటి దేశంలో ప్రభుత్వాల సహాయం అన్ని వర్గాల ప్రజలకు అర్హతను బట్టి అందడం లేదు. ఈ విషమ సమయాల్లో వాలంటీర్ల కృషి వాంఛనీయం, అత్యవసరమని నమ్మాలి. యువతలో నిస్వార్థ సేవాభావాన్ని జాగృతం చేయడానికి యన్‌సిసి, యన్‌యస్‌యస్ లాంటి విభాగాలు కృషి చేస్తున్నాయి. అంతర్జాతీయ వీలంటీర్ల దినం వేదికగా కార్యకర్తలను సన్మానించడం, వారి సేవలను గుర్తించడం, యంజీఓలతో కలిసి సేవలు చేయడం, వాలంటీర్ వ్యవస్థలకు చేయూత ఇవ్వడం చేయాలి. ఈ వేదికగా ర్యాలీలు, ప్రదర్శనలు, పరెడ్లు, రక్తదాన శిబిరాలు, సదస్సులు, నిధుల సేకరణ, కార్యశాలలు, విద్యా సంస్థల్లో యువతతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం, యంజీఓలను కొనియాడడం లాంటి కార్యక్రమాలు చేయాలి.

### సర్వప్రాణి సేవయే మాధవ సేవ:

ఇతరులకు సేవ చేస్తూ మన మానవీతను ప్రదర్శిద్దాం. స్వచ్ఛంద సేవకులను సమయం దొరుకుతుంది. మన జత చేతుల్లో ఒకటి మన కోసం, మరోటి సమాజం కోసం అని నమ్మాలి. మన నిత్యజీవితంలో ఇతరులకు ఎంత సమయం వెచ్చిస్తున్నామనే విషయాన్ని గుర్తించాలి. సర్వప్రాణి సేవలో దైవత్వాన్ని దర్శిద్దాం. నవ్వుతూ ఉందాం, నవ్వులను పంచుదాం అనే నినాదాన్ని జీవన సూత్రంగా తీసుకుందాం. వాలంటీర్ల సేవలకు ఖరీదు కట్టలేం, అవి అమూల్యమైనవి. ప్రతి చిన్న చేయూత ప్రపంచ శాంతికి తోడవుతుంది. మాట్లాడే పెదవుల కన్న చేయూతనిచ్చే చేతులే మిన్నయని మరువరాదు. మన జీవితాలు మన కోసమే కాదు, మన సమాజం కోసం కూడా అని నమ్మాలి. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవల పట్ల అవగాహన పెంచుదాం. అత్యవసర సమయంలో గుక్కెడు నీళ్లు కూడా ప్రాణాలను నిలుపుతాయి.

బిందువు, బిందువు కలిస్తేనే మహా సముద్రం అవుతుంది. చిన్న చిన్న సేవలే పెద్ద మార్పులకు పునాది అని తెలుసుకోవాలి. మనందరం టైమ్, టాలెంట్, ట్రెజర్లను కొంత సమాజ హితానికి వెచ్చిద్దాం. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030 సాధనకు స్వచ్ఛంద సేవకులుగా మారి సుందర ప్రపంచాన్ని నిర్మాణంలో మనదైన పాత్రను నిర్వహిద్దాం. స్వార్థమే తెలియని రేపటి శాంతియుత సమాజాన్ని స్థాపిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 'మతి కళా మహోత్సవ్'లో అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఈరోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన మతి కళా మహోత్సవ్‌లో కేంద్ర హోం మరియు సహకార శాక మంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ నారాయణ్ రాణే, శ్రీ భానుప్రతాప్ సింగ్ వర్మ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో ఖాదీ మతి కళా మహోత్సవం ఒక బహుమితీయ ఆలోచన అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దీన్ని ముందుకు తీసుకువెళ్లారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంతో ముడిపెట్టి ఖాదీ ఆలోచనను మహాత్మాగాంధీ తొలిసారిగా అందరి ముందుంచారని, దీని ద్వారా పేదరికంలో మగ్గుతున్న వారందరినీ ఉపాధితో అనుసంధానం చేసేందుకు బాపు కృషి చేశారని అన్నారు. దీనితో పాటు గాంధీజీ విదేశీ దుస్తులకు డిమాండ్‌ను తగ్గించడానికి మరియు స్వదేశీ మరియు స్వరాజ్ స్ఫూర్తిని ప్రతి గ్రామానికి వ్యాపింపజేయడానికి కృషి చేశారని చెప్పారు. నేటికీ ఖాదీ ఆలోచన బహుమితీయమైనది మరియు బహుళ ప్రయోజనకరమైనది అని శ్రీ షా అన్నారు. ప్రధాని మోదీ ఖాదీ ఆలోచనను పునరుజ్జీవింపజేయడమే కాకుండా ఖాదీని ముందుకు తీసుకెళ్లి సామాన్య ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు కృషి చేశారని అన్నారు.

"వోకల్ ఫర్ లోకల్" పిలుపులో స్వదేశీ మరియు ఉపాధిని అనుసంధానం చేసే పనిని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేశారని కేంద్ర హోం మరియు సహకారశాఖ మంత్రి అన్నారు. శ్రీ మోదీ దార్శనికత వల్లనే ఖాదీ ఉద్యమం నేడు కొత్త పుంతలు తొక్కుతున్నదని అన్నారు. శ్రీ మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని చెప్పారు . శ్రీ మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని, దీనితో పాటు ఆర్థిక వ్యవస్థను అందరినీ కలుపుకొని పోయేందుకు ప్రధాని మోదీ అనేక చర్యలు తీసుకున్నారని శ్రీ షా తెలిపారు. ఖాదీ టర్నోవర్‌ను మూడు రెట్లు పెంచడం అంటే కోట్లాది మందికి ఉపాధి కల్పించడమేనని, ఈ ప్రజలు స్వయంశక్తితో ఎదిగినప్పుడు పెరుగు తున్న జిడిపి సంఖ్య మానవీయంగా మారుతుందని ఆయన అన్నారు. ఇది కోట్లాది ప్రజల జీవితాల్లో విశ్వాసం, స్వావలంబన మరియు సంతోషాన్ని కూడా తెస్తుందని తెలిపారు. ఈ రోజు ఈ ఖాదీ మతి కళా మహోత్సవంలో 300 ఎలక్ట్రిక్ కుమ్మరి చక్రాలు, 40 వ్యవసాయ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టూల్ కిట్‌లు, మహిళలకు 40 అగరబత్తుల తయారీ యంత్రాలు, 20 ఫ్లంబింగ్ కిట్‌లు, 200కి పైగా సంప్రదాయ చరఖాలను అందజేసినట్లు తెలిపారు. ఖాదీ ఉత్పత్తికి చాలా ముఖ్యమైన సెంట్రల్ సిల్వర్ ప్లాంట్ (సీఎస్‌పి) నేడు ప్రారంభించబడిందని శ్రీ అమిత్ షా అన్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ సీఎస్‌పీని రూ. 10 కోట్లతో ఆధునీకరించామని దీని వల్ల ఉత్పత్తి పెరిగి నాణ్యత మెరుగవుతుందని, ఖాదీ నూలు వడకుతున్న ప్రజల మెటీరియల్ అంతా సద్వినియోగం అవుతుందన్నారు. మెయిల్, పార్శిల్ బుకింగ్, ఆధార్ సేవలు, బ్యాంకింగ్ పోస్టల్ సేవలు, జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, పింఛనుదారులకు డిజిటల్ సర్టిఫికెట్లు వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఈరోజు కొత్తగా నిర్మించిన 8 పోస్టాఫీసులను ప్రారంభించామని శ్రీ షా చెప్పారు. ఇప్పుడు గాంధీనగర్ ప్రాంత ప్రజలందరూ పాస్‌పోర్టు కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని ఇకపై తమ దగ్గరలోని పోస్టాఫీసు నుంచి దరఖాస్తును ప్రాసెస్ చేసుకోవచ్చని తెలిపారు. ఇదే పోస్టాఫీసులు గాంధీనగర్ ప్రాంతంలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కింద 53,000 జాతీయ జెండాలను పంపాయని ఆయన తెలిపారు. ప్రధాని మోదీ ఈ ప్రచారాన్ని రూపొందించినప్పుడు, దేశభక్తి స్ఫూర్తిని మేల్కొల్పడానికి ఈ ప్రచారం ఇంత పెద్ద విజయాన్ని సాధిస్తుందని ఎవరూ ఊహించలేదని శ్రీ షా అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయని భవనం లేదని, ఈ ప్రచారం దేశభక్తిని పునరుజ్జీవింపజేస్తోందని అన్నారు.

ఈ రోజు పిఎంఈజీపీ కింద గుజరాత్‌తో సహా భారతదేశం అంతటా 5000 మంది లబ్దిదారులకు సుమారు 200 కోట్ల రూపాయల మార్జిన్ మనీని ఆన్‌లైన్‌లో చెల్లించడం జరిగిందని, దీనివల్ల వారు 600 కోట్ల రూపాయల రుణం పొందవచ్చని కేంద్ర హోం మంత్రి చెప్పారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ గత 9 ఏళ్లలో ఎంతో ప్రగతిని సాధించిందని అన్నారు. శ్రీ మోదీ ఖాదీకి ప్రాధాన్యత ఇచ్చారని, ఫలితంగా 2022-23లో ఖాదీ మొత్తం టర్నోవర్ రూ. 1,35,000 కోట్లు దాటిందని శ్రీ షా చెప్పారు. ఈ రూ. 1,35,000 కోట్ల టర్నోవర్‌కు కనీసం 1 లక్ష మంది ప్రజలు సహకరించారని గుర్తు చేశారు. ఈ రోజు రూ. 1,35,000 కోట్ల టర్నోవర్ ద్వారా లక్షలాది మంది తమ జీవనోపాధిని సాధించి గౌరవంగా జీవిస్తున్నారని చెప్పారు.

ప్రతి కుటుంబం ఏడాదిలో రూ. 5,000 విలువైన ఖాదీ లేదా ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఖాదీని ప్రోత్సహించాలని కేంద్ర హోంమంత్రి గుజరాత్ మరియు దేశ ప్రజలను అభ్యర్థించారు. దేశంలోని ప్రతి కుటుంబం రూ. 5000 విలువైన ఖాదీని కొనుగోలు చేస్తే దేశంలో నిరుద్యోగుల సంఖ్య సగానికిపైగా తగ్గిపోతుందన్నారు.

# జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామం & జాతీయ ఉత్తమ గ్రామీణ హోం స్టేల పోటీ 2024ను ప్రారంభించిన పర్యాటక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:దేశంలో గ్రామీణ పర్యాటకాన్ని బలోపేతం చేసి, అభివృద్ధి చేసేందుకు పర్యాటక మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఉత్తమ పర్యాటక గ్రామం 2024ను, జాతీయ ఉత్తమ గ్రామీణ హోమ్ స్టే (ఇంట్లో ఆతిథ్యం ఇచ్చే) పోటీ 2024 ని ప్రారంభించింది. భారతదేశ వ్యాప్తంగా 2023లో నిర్వహించిన జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామం పోటీలో 35 గ్రామాలను స్వర్ణ, రజత, కాంశ్య వర్గాలుగా గుర్తించింది.

భారత్‌లో గ్రామీణ పర్యాటకాన్ని పెంచేందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ భారత దేశంలో గ్రామీణ హోమ్‌స్టేల ప్రోత్సాహానికి జాతీయ వ్యూహంతో పాటు, గ్రామీణ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు రోడ్‌మ్యాప్‌ను, సమగ్ర జాతీయ వ్యూహాన్ని ప్రారంభించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ సహకారంతో జాతీయ వ్యూహాల అమలును మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. గ్రామీణ పర్యాటకాన్ని, గ్రామీణ హోమ్ స్టేలను ప్రోత్సహించేందుకు వ్యూహాత్మక చొరవల్లో ఒకటిగా జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామం & జాతీయ ఉత్తమ గ్రామీణ హోం స్టేల పోటీలను ప్రారంభించింది.

గ్రామీణ పర్యాటక వృద్ధికి తగిన వాతావరణాన్ని సృష్టించేందుకు, సహకారాన్ని పెంచుకునేందుకు మంత్రిత్వ శాఖ ఈ పోటీల ద్వారా ప్రభుత్వాలను, పరిశ్రమ భాగస్వాములను, స్వచ్ఛంద సంస్థలను (ఎన్జీవోలు), స్థానిక సమూహాలను ఇందులో ఉపయోగించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసే కృషిని ఈ బహుళ భాగస్వాముల పద్ధతి సమన్వితం చేస్తుంది.

ఈ పోటీలు గ్రామాల మధ్య, గ్రామీణ హోంస్టేల మధ్య ఆరోగ్యవంతమైన పోటీని అభివృద్ధి చేయడం ద్వారా, గ్రామీణ పర్యాటకానికి అసాధారణంగా దోహదం చేస్తున్న వారిని గుర్తించి, ప్రతిఫలాన్ని అందించడం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు చురుకుగా దోహదం చేస్తున్న సమూహాలకు, వ్యక్తులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది.

తక్కువగా అన్వేషించిన ప్రాంతాలలో పర్యాటకాన్ని ఇది ప్రోత్సహించడమే కాక, సమాజాల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఒక ప్రభావాన్ని సృష్టించేందుకు, సాంస్కృతిక ప్రామాణికతను పరిరక్షించి, పర్యాటక రంగంలో సుస్థిరమైన, బాధ్యతాయు తమైన కార్యాచరణలను ప్రోత్సహిస్తుంది.

గ్రామీణ పర్యాటక చొరవలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు పర్యాటక మంత్రిత్వ శాఖ గ్రామీణ పర్యాటకానికి, గ్రామీణ హోంస్టే కోసం కేంద్ర నోడల్ ఏజెన్సీ (సిఎన్ఎఆర్‌టి ఉ ఆర్‌హెచ్)ని ఏర్పాటు చేసింది. గ్రామీణ స్థాయిలో ఈ పోటీల గురించి ప్రచారం చేసేందుకు మాస్టర్ ట్రైనర్లను సృష్టించేందుకు రాష్ట్రాలకు సామర్థ్య నిర్మాణ సెషన్‌ను సిఎన్ఎ ఆర్‌టిడ ఆర్‌హెచ్ నిర్వహిస్తోంది.

ఈ పోటీని ప్రపంచ పర్యాటక దినోత్సవం, అంటే 27 సెప్టెంబర్ 2023న ప్రారంభించారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు దరఖాస్తులను 15 నవంబర్ నుంచి 31 డిసెంబర్ 2023వరకూ స్వీకరించనున్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టూరిజం. గవ్. ఇన్ (www.rural .tourism.gov.in) పోర్టల్ ద్వారా దరఖాస్తులను పొందవచ్చు.

# భారతీయ వాతావరణ పరిస్థితులకు అత్యంత అనుకూలమైన శీతలకరణి అంశాలపై పరిశోధనలు జరగాలి : శ్రీమతి నందన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:పర్యావరణ లక్ష్యాలు సాధించడానికి భారతదేశం నిరంతరం కృషి చేస్తుందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి లీనా నందన్ తెలిపారు. దుబాయ్‌లో యూఎన్ఎఫ్‌సీసీ కాప్ 28 సదస్సులో భాగంగా ఇండియా పెవిలియన్‌లో "స్థిరమైన శీతలీకరణ వైపు భారతదేశం ప్రయాణం" అనే అంశంపై ఈ రోజు జరిగిన సమావేశంలో శ్రీమతి లీనా నందన్ పాల్గొని ప్రసంగించారు లక్ష్య సాధన కోసం భారతదేశం చేస్తున్న కృషికి పర్యావరణ అంశంలో జాతీయ స్థాయిలో సాధించిన ప్రగతి నిదర్శనంగా ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం భారతదేశం చేస్తున్న కృషిని వివరించిన శ్రీమతి లీనా నందన్ " 2015లో భారతదేశం ఎన్డీసీ లక్ష్యాలు ప్రకటించింది. 2030 నాటికి కర్బన ఉద్గార తీవ్రతను 33-35% వరకు తగ్గించాలని భారతదేశం నిర్ణయించింది. అయితే, భారతదేశం చేసిన కృషి వల్ల ముందుగానే లక్ష్యాలు నెరవేరాయి. అభివృద్ధి పథంలో పయనిస్తున్న భారతదేశం కర్బన వుడిగారాలు తగ్గించింది. ఆర్థిక వృద్ధి నుండి ఉద్గారాలను క్రమంగా విడదీసి అభివృద్ధి సాధిస్తున్నాం. 2019 నాటికి జీడీపీ లో ఉద్గార తీవ్రత 33% తగ్గింది. " అని వివరించారు. ఇంధన అవసరాల కోసం పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యత ఇస్తూ భారతదేశం లక్ష్యాలను సాధించిందని ఆమె అన్నారు.

సాధించిన విజయాలతో భారతదేశం సరిపెట్టుకోదని శ్రీమతి నందన్ స్పష్టం చేశారు. " పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలు సాధించాలని భారతదేశం లక్ష్యంగా నిర్ణయించుకుంది. జాతీయ స్థాయిలో గత సంవత్సరం నవీకరించబడిన వాతావరణ మార్పుల లక్ష్యాలను భారతదేశం సాధించింది. ప్రపంచ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు మరింత కృషి జరగాలి అని భారతదేశం భావిస్తోంది." అని ఆమె అన్నారు.

"సమస్యకు భారతదేశం కారణం కాదు. కానీ వాతావరణ మార్పుల పర్యవసానాలను ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సమస్య పరిష్కారంలో ప్రధాన పాత్ర పోషించాలి అన్న విధానంతో భారతదేశం పని చేస్తుంది. ఆర్థిక వ్యవస్థ , జీవావరణ శాస్త్రం, అభివృద్ధి , పర్యావరణం మధ్య సమతుల్యత సాధించి అభివృద్ధి సాధించాలి అన్నది భారతదేశం విధానం" అని ఆమె వివరించారు.

"ఇండియా కూలింగ్ యాక్షన్ ప్లాన్ అనేక దేశాలకు నమూనాగా మారింది. మార్పులకు అనుగుణంగా పని చేయడానికి మరిన్ని ప్రయత్నాలు అవసరం. భారతీయ వాతావరణ పరిస్థితులకు అత్యంత సముచితంగా ఉండే శీతలకరణ అంశాలపై పరిశోధనలు జరగాలి. పరిశ్రమ వర్గాలతో సమన్వయం సాధించి సాధ్యమైనంత త్వరగా పరిశోధన ఫలితాలు అమలు జరగాల్సిన అవసరం ఉంది" అని శ్రీమతి లీనా నందన్ తెలిపారు.

బాధ్యతాయుత, స్థిర అభివృద్ధి ఎలా సాధించాలి అన్న అంశానికి భారతదేశం ఒక ఉదాహరణగా నిలుస్తుందని శ్రీమతి లీనా నందన్ వ్యాఖ్యానించారు. సమన్యల పరిష్కారానికి అన్ని చర్యలు అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శీతలీకరణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా మార్చాలని ఆమె పరిశ్రమ, సంబంధిత వర్గాలకు ఆమె సూచించారు.

మాంట్రియల్ ప్రోటోకాల్ కింద భారతదేశం సాధించిన లక్ష్యాలు , పర్యావరణ స్థిరత్వానికి అవసరమైన స్థిరమైన శీతలీకరణ, థర్మల్ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి కోసం భారతదేశం చేస్తున్న కృషిని వివరిస్తూ పెవిలియన్ వద్ద కార్యాచరణ ప్రణాళిక ప్రదర్శించారు.

కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు శ్రీమతి రాజశ్రీ రే భారతదేశంలో స్థిరమైన శీతలీకరణ, ఉష్ణ సౌలభ్యాన్ని సాధించేందుకు సమీకృత విధానం ప్రాముఖ్యతను వివరించారు.

కార్యక్రమంలో భాగంగా "స్థిరమైన శీతలీకరణ దిశగా భారతదేశం ప్రయాణం"పై ఒక నివేదికకు విడుదల చేశారు. అంతర్జాతీయ పర్యావరణ ప్రమాణాలు, ప్రమాణాల సాధన కోసం భారతదేశం అమలు చేస్తున్న కార్యక్రమాలు, చర్యలను దీనిలో పొందుపరిచారు.

నివాస, వాణిజ్య భవనాలు, కోల్డ్-చైన్, శీతలీకరణ, రవాణా, పరిశ్రమలు వంటి వివిధ రంగాలలో శీతలీకరణ కీలకంగా ఉంటుంది. దేశ ఆర్థిక వృద్ధితో పాటు శీతలీకరణ డిమాండ్ పెరుగుతుంది. విడి విడిగా కాకుండా సమీకృత చర్యలు అధిక ప్రభావాన్ని చూపుతాయని గుర్తించిన ప్రభుత్వం శీతలీకరణ పట్ల సమగ్ర దీర్ఘకాలిక దృష్టి సారించి ఇండియా కూలింగ్ యాక్షన్ ప్లాన్ (ICAP)కు రూపకల్పన చేసింది. ప్రణాళిక అమలులో బహుళ వినియోగ వర్గాలు భాగస్వాములుగా ఉంటాయి. సమీకృత, సంప్రదింపుల ప్రక్రియ ద్వారా ప్రణాళిక అమలు జరుగుతుంది. వివిధ రంగాలలో శీతలీకరణ డిమాండ్, శీతలీకరణ అవసరాలు, స్థిరమైన శీతలీకరణ ప్రాప్యతను అందించే మార్గాలు, సమస్య పరిష్కారానికి మార్గాలు సూచించడం తదితర కార్యక్రమాలు ప్రణాళికలో భాగంగా అమలు జరుగుతాయి.

ఓజోన్పై ప్రభావం చూపని పదార్థాలు, భూతాపం తగ్గించే సాంకేతికతలను ఉపయోగించాలని మాంట్రియల్ ప్రోటోకాల్ లో ప్రపంచ దేశాలు అంగీకరించాయి. ఈ ఒప్పందంపై భారతదేశంతో సహా పలు దేశాలు సంతకం చేశాయి. లక్ష్య సాధనలో కొన్ని సందర్భాల్లో అగ్రగామిగా ఉన్న భారతదేశం . మాంట్రియల్ ప్రోటోకాల్ లో అంగీకరించిన విధంగా 1.1.2020 నాటికి ముందే దృఢమైన పాలియురేతేన్ ఫోమ్ ఉత్పత్తిలో బ్లోయింగ్ ఏజెంట్‌గా ఉపయోగించే HCFC 141బిని దశలవారీగా తొలగించి లక్ష్యాన్ని సాధించింది. అదేవిధంగా, కొత్త పరికరాల తయారీలో HCFC వినియోగాన్ని 31.12.2024 నాటికి దశలవారీగా నిలిపి వేయాలని భారతదేశం నిర్ణయించింది. మాంట్రియల్ ఒప్పందంలో నిర్ణయించిన లక్ష్యం కంటే ముందుగానే భారతదేశం ఈ లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించింది. 1.1.2020 నాటికి HCFC ఉత్పత్తి, వినియోగాన్ని 35% తగ్గించాలని నిర్ణయించారు. HCFC వినియోగాన్ని దశలవారీగా నిర్మూలించడానికి భారతదేశం 44% లక్ష్యాలను సాధించింది.

సదస్సులో బ్లూ స్టార్ లిమిటెడ్, ఎస్ఆర్ఎఫ్ లిమిటెడ్, సుబ్రోస్ టెక్నికల్ సెంటర్ ప్రతినిధులు ప్రసంగించారు. స్థిరమైన శీతలీకరణ కోసం పరిశ్రమలు అమలు చేస్తున్న కార్యక్రమాలను వారు వివరించారు. మాంట్రియల్ ఒప్పందం అమలు కోసం కృషి చేస్తున్న యుఎన్డీపి, యుఎన్ఈపీ తదితర సంస్థలు లక్ష్య సాధన కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించాయి.

# జపాన్‌లోని యోకోసుకాలో డిసెంబర్ 02-05 తేదీల్లో ఐఎన్ఎస్ కద్మత్ పర్యటన



న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో దీర్ఘ శ్రేణి కార్యాచరణ విస్తరణలో భాగంగా, 2023 డిసెంబర్ 02న, జపాన్‌లోని యోకోసుకాలోకి ఐఎన్ఎస్ కద్మత్ ప్రవేశించింది. వృత్తిపరమైన పరస్పర కార్యాచరణలు, సమాజ సంక్షేమ కార్యకలాపా లు, నౌకల సందర్శనలు ఈ పర్యనటలో ఉంటాయి. జపాన్ మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్‌తోనూ (జేఎంఎస్‌డీఎఫ్) నౌకల పరస్పర సందర్శనలు, వృత్తిపరమైన ఆలోచనల మార్పిడి, ఉమ్మడి యోగాసనాలు, ఉమ్మడి సముద్ర విన్యాసాల కోసం సమావేశం నిర్వహిస్తారు. జపాన్‌లో నివశిస్తున్న భారతీయ సమక్షంలో, 04 డిసెంబర్ 2023న, నౌకాదళ దినోత్సవాన్ని ఈ నౌక జరుపుకుంటుంది.

రెండు దేశాల నౌకాదళాల మధ్య కుదిరిన ఒప్పందం (ఆర్‌పీఎస్ఎస్) ప్రకారం, జేఎంఎస్‌డీఎఫ్ వేగవంతమైన యుద్ధ సహాయక నౌక జేఎస్ తోవాడాకు ఐఎన్ఎన్ కద్మత్ ఇంధనాన్ని అందజేయడం ప్రారంభించింది. 28 నవంబర్ 2023న ఇది ప్రారంభమైంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంపై రెండు దేశాల దృక్పథాలకు అనుగుణంగా, భారత్-జపాన్ మధ్య సముద్ర రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడం ఐఎన్ఎస్ కద్మత్ పర్యటన లక్ష్యం. ఐఎన్ఎస్ కద్మత్ నౌకను దేశీయ పరిజ్ఞానంతో నిర్మించారు, ఇది జలాంతర్గామి విధ్వంసక నౌక. అత్యాధునిక ఏఎస్ ఆయుధ శ్రేణి అందులో ఉంది.

# 11న జగన్ కేబినెట్ భేటీ..



అమరావతి, డిసెంబర్ 4:ఈ నెల 11న సీఎం జగన్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఈ కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ మేరకు సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. కేబినెట్‌లో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదన లను ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా పంపాలని అన్ని శాఖలను సీఎస్ డా. కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. విశాఖ నుంచి పరిపాలన, నవరత్నాల పథకాల అమలుకు ఆమోదం సహా పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మరోవైపు ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ వంటి అంశాలపై సీఎం జగన్ కేబినెట్‌లో చర్చించనున్నారు.

# నేవీ డే సందర్భంలో శుభాకాంక్షలను తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:"నేవీ డే సందర్భం లో, భారతీయ నౌకా దళం యొక్క సిబ్బంది అందరికీ ఇవే శుభాకాంక్ష లు.

సముద్రాల సు రక్ష విషయం లో వారి యొక్క నిబద్ధ త అనేది కర్తవ్యం పట్ల వారి అచంచ లమైనటువంటి సమర్పణ భావాని కి మరియు మన దేశ ప్రజల పట్ల వారి కి ఉన్న ప్రేమ కు ఒక నిదర్శన గా ఉంది.

ప్రతి ఒక్క పరిస్థితి లోను వారి యొక్క ఉత్సాహం మరియు వారి యొక్క సంకల్పం స్థిరం గా ఉంటున్నాయి. వారు అందిస్తున్నటువంటి సేవ కు మరియు వారు చేస్తున్నటువంటి త్యాగాలకు గాను వారి కి మనం ఎల్లప్పటికీ కృతజ్ఞులముగా ఉంటాం. నేను ఈ రోజున మహారాష్ట్ర లోని సింధు దుర్గ్ లో నేవీ డే కార్యక్రమం లో పాలుపంచుకోవాలని ఉత్సాహం గా ఎదురుచూస్తున్నాను.

ఈ ప్రదేశాని కి ఛత్ర పతి శివాజీ మహారాజ్ తో సన్నిహిత సంబంధం ఉన్నది; బలమైనటువంటి నౌకాదళాన్ని నిర్మించే దిశ లో ఆయన ప్రయాస లు అందరికీ తెలిసినటువంటివే." అని పేర్కొన్నారు.


HRK
వచన పద్యాలు
అబద్ధం
ఆవిష్కరణ సభ




బండ్ల మాధవరావు
పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు
కవిత్వ ప్రేమికులు
సీతారాం
ప్రసేన్
శ్రీరాం
మారుతీ పౌరోహితం
పాల్గొని ప్రసంగించే ఈ సభను
యువకవి అనిల్ డ్యానీ నిర్వహిస్తారు
కవి మిత్రుల్ని సాదరంగా
ఆహ్వానిస్తున్నాం !

ది.10.12.2023 ఆదివారం సా॥ 6.00 గంటలకు
బాలోత్సవ్ భవన్, రెండవ అంతస్తులో
రాఘవయ్య పార్క్ వద్ద, విజయవాడ.

సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ
విజయవాడ పక్షాన
విశ్వేశ్వరరావు
9490634849

# ఐఐటీ రోపర్‌లో సాంకేతిక అంకుర సంస్థల ప్రోత్సాహక కార్యక్రమం 'సమృద్ధి కాంక్లేవ్' ప్రారంభం



న్యూఢిల్లీ, డిసెంబర్ 4:పంజాబ్ గవర్నర్ శ్రీ బన్వరీలాల్ పురోహిత్, 'సమృద్ధి కాంక్లేవ్' పేరిట ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఐఐటీ రోపర్‌లో ప్రారంభించారు. ఇది, సాంకేతిక అంకుర సంస్థల ప్రోత్సాహక కార్యక్రమం. ఇంటర్ డిసిప్లినరీ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్ జాతీయ మిషన్ (ఎన్ఎం-ఐసీపీఎస్) కింద ఏర్పాటైన సాంకేతికత ఉ ఆవిష్కరణల కేంద్రం ఐహబ్ అవధ్ కింద ఈ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. వ్యవసాయం, జల సాంకేతికత రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలు ప్రదర్శించడం దీని లక్ష్యం.

సమృద్ధి కాన్‌క్లేవ్‌లో ఐదు వ్యూహాత్మక సహకారాలు, ఐదు బలమైన సాంకేతిక ఆవిష్కరణలు ఉన్నాయి. 25 అంకుర సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించగా, కఠిన మూల్యాంకనం తర్వాత 13 అంకుర సంస్థలను ఎంపిక చేశారు. 30 మందికి పైగా నిపుణులు మార్కెట్ పరిశోధన, ఆవిష్కరణ, అభివృద్ధి అంశాల్లో వ్యూహాత్మక మార్గాలపై మాట్లాడారు.

శాస్త్ర, ఇంజినీరింగ్ పరిశోధన బోర్డు కార్యదర్శి ఉ డీఎస్‌టీ సీనియర్ సలహాదారు డాక్టర్ అఖిలేష్ గుప్తా, ఆత్మనిర్భర్ భారత్‌ను ఆవిష్కరించడానికి ఎన్ఎంసీపీఎస్ తీసుకున్న ప్రయత్నాల గురించి వివరించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలు, రక్షణ, పర్యావరణం వంటి అన్ని రంగాల్లో సీపీఎస్ సాంకేతికత అవసరంపై ముఖ్యాంశాలను ఎన్ఎం మిషన్ డైరెక్టర్ డాక్టర్ ఏక్తా కపూర్ ప్రదర్శించారు.

ఐఐటీ రోపర్ డైరెక్టర్, ప్రొ. రాజీవ్ అహూజా; పంజాబ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. రేణు విగ్, డా. పుష్పేంద్ర పాల్ సింగ్, అవధ్ ప్రాజెక్టు డైరెక్టర్, భాషిణి డిజిటల్ ఇండియా సీఈవో అమితాబ్ నాగ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్ఎంఐసీపీఎస్ ద్వారా సాంకేతికత భవిష్యత్తును రూపొందించడంలో డీఎస్‌టీ కీలక పాత్రను ఈ కార్యక్రమం విస్పష్టం చేసింది. ఈ మిషన్ ద్వారా 311 సాంకేతికతలు, 549 సాంకేతిక ఉత్పత్తులు బయటకు వచ్చాయి. 1,613 సీపీఎస్ పరిశోధన పత్రాలను సృష్టించారు, 60,000కు పైగా సీపీఎస్ నైపుణ్యాలకు ఉపయోగపడింది.

ఐఐటీ రోపర్‌కు చెందిన అవధ్ నిర్వహించిన ఈ కాన్‌క్లేవ్‌కు 46 మంది పెట్టుబడి భాగస్వాములు హాజరయ్యారు. 50 మంది జ్యూరీ సభ్యులు అంకుర సంస్థలను మూల్యాంకనం చేశారు. నూతన ఆవిష్కరణలు ఉ సాంకేతికతలో స్వయంసమృద్ధి కోసం దేశవ్యాప్తంగా 110 మంది భాగస్వాములు సహకరించారు. ఎన్ఎం-ఐసీపీఎస్ కింద, భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతికత విభాగం (డీఎస్‌టీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సాంకేతికత, ఆవిష్కరణల అభివృద్ధిలో డీఎస్‌టీ నిబద్ధతను ఈ కార్యక్రమం గుర్తు చేసింది.

# ఆస్ట్రేలియా క్రికెట్‌లోకి అమెజాన్ ఎంట్రీ.. నాలుగేండ్లకు భారీ ఒప్పందం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ఇటీవలే వన్డే ప్రపంచకప్‌ను ఆరోసారి గెలిచిన ఆస్ట్రేలియా.. వచ్చే నాలుగేండ్లకు అమెజాన్ ప్రైమ్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్ట్రేలియాలో రాబోయే నాలుగేండ్లకు గాను ఐసీసీ టోర్నీల ప్రసార హక్కులను అమెజాన్ ప్రైమ్ దక్కించుకుంది. సంప్రదాయకంగా ఆస్ట్రేలియాలో క్రికెట్ అభిమానులు ఛానెల్ 9, ఫాక్స్, సెవెన్ ఛానెల్స్‌లో మ్యాచ్‌లు ప్రసారమవుతాయి. కానీ ఇకనుంచి ఫాక్స్, సెవెన్ మాత్రమే ఆస్ట్రేలియా స్వదేశంలో మ్యాచ్‌లను ప్రసారం చేయనుండగా ఐసీసీ టోర్నీలు మొత్తం ప్రైమ్ లోనే ప్రసారం కానున్నాయి. ఈ ఒప్పందంతో కంగారూ అభిమానులు ఇకనుంచి టీవీలలో ఉచితంగా ఐసీసీ ట్రోఫీలను లైవ్‌గా వీక్షించడం కుదరదు.

రాబోయే నాలుగేండ్లలో మెన్స్ టీ20 వరల్డ్ కప్ (2024 అమెరికా, వెస్టిండీస్), ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ (2024, బంగ్లాదేశ్), మెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ (2025, పాకిస్తాన్), వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (2025, ఇంగ్లండ్), ఉమెన్స్ వరల్డ్ కప్ (2025, ఇండియా), మెన్స్ టీ20 వరల్డ్ కప్ (ఇండియా, శ్రీలంక), ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ (2026, ఇంగ్లండ్), ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ (2027, శ్రీలంక), మెన్స్ వరల్డ్ కప్ (2027, సౌతాఫ్రికా, నమీబియా, జింబాబ్వే) లు ఆస్ట్రేలియా అభిమానులు చూడాలంటే ప్రైమ్ సబ్ స్క్రిప్షన్ ఉండాల్సిందే.

# మేడ్చల్‌ను మరింత అభివృద్ధి చేస్తా : మాజీ మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ మల్కాజిగిరి, డిసెంబర్ 4 : మేడ్చల్ ప్రజల రుణం తీర్చుకోనిలేదని, మేడ్చల్‌ను మరింత అభివృద్ధి చేస్తానని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారులు మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే మల్లారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించారని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండల్ ముదిరాజ్, సుధాకర్‌చారి, సింగన్న బాల్‌రాజ్, ఎల్లస్వామి, ప్రకాశ్, పరశురామ్, భాస్కర్, నర్సింహా, పృధ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంది : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, డిసెంబర్ 4: ముఠా తగాదాలు వదిలి కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాలను కలుపుకొని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తనను గెలిపించినందుకు స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ ప్రజలకు కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్ పూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ప్రభుత్వ రాబడికి ఎక్కడ పొంతన కుదరడం లేదు. కేసీఆర్ నేతృత్వంలో అనేక రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఉద్భవించిన పార్టీ. తెలంగాణ ప్రజల హక్కులకు భంగం వాటిల్లితే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల డీఎన్ఏ లోనే పోరాటం ఉంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐకమత్యంగా ఉండి ప్రజలకు సుపరిపాలన అందించాలని సూచించారు. మెజార్టీ సాధించి అధికారంలోకి వస్తున్న కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు.

# అప్రమత్తంగా ఉన్నాం - నిరంతరంగా పర్యవేక్షిస్తున్నాం.. కలెక్టర్



తిరుపతి, డిసెంబర్ 4: భారీ వర్షాలపై ప్రత్యేక బృందాలతో పరిస్థితులను పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నామని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి తెలిపారు. దక్షిణ కోస్తా జిల్లాలపై తుఫాన్ ప్రభావం తెలుసుకుని తగు ఆదేశాలు ఇవ్వడానికి ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 8 జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన ఇతర జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఆ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అందులో భాగంగా జిల్లా యంత్రాంగం పూర్తిగా తుఫాన్ కార్యక్రమాల్లో నిమగ్నమైందని, సాధారణ వర్షపాతం కన్నా కొన్ని మండలాల్లో అధికంగా ఈ 3 రోజుల్లో నమోదు అయిందని చెప్పారు. ఇప్పటి వరకు 31 గ్రామాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి 2,620 మందికి వసతి, భోజనం, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించామని, అలాగే 162 మంది ప్రసవ సమయానికి 10 నుండి 15 రోజులు ఉన్న గర్భిణీ స్త్రీలను ఆసుపత్రులలో చేర్పించామని తెలిపారు.

రాత్రి నుండి గాలుల ప్రభావం అధికంగా వుందని చాలా చోట్ల చెట్లు పడిపోతున్నాయని, ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. గత నెల 30నుండి వర్షాలు పడుతున్నాయని, దురదృష్ట వశాత్తు గుడిసె మట్టిగోడ కూలి 4 సంవత్సరాల బాలుడు మృతి చెందాడని, ఆ కుటుంబానికి ఈరోజు రూ. 4 లక్షలు పరిహారం అందించనున్నామని తెలిపారు. జిల్లాలో పలుచోట్ల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రాజెక్టుల్లో కళ్యాణి డ్యాం మినహా ఇతర జలాశయాలు, జిల్లాలోవున్న 2,557 చెరువుల్లో 1500 వరకు పూర్తిగా నిండాయని, మరో 600 చెరువుల్లో 50 నుండి 70శాతం వరకు నిండాయని వివరించారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని వివరించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి వరి కోతలు పూర్తియినందున పెద్ద నష్టం లేదని, ఉద్యానవన పంటలకు సంబంధించి 25ఎకరాల్లో ఇప్పటివరకు దెబ్బ తిన్నాయని వివరించారు. గాలులు అధికంగా వుండటంతో విద్యుత్ స్థంబాలు 33 కెవి 13 పోల్స్ , 11 కేవీ పోల్స్ 16, సబ్ స్టేషన్లు 29 వరకు డ్యామేజ్ అయ్యాయని, అవకాశం వున్నచోట పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని, తుఫాన్ ప్రభావం తగ్గిన 48 గంటల్లో పూర్తిస్థాయి నివేదిక అందిస్తామని చెప్పారు.

ఈరోజు ముఖ్యమంత్రి సూచించిన విధంగా పునరావాస కేంద్రాల నుండి ఇళ్ళకు వెళ్ళే సమయంలో ఒక్కరికి రూ.1000/, కుటుంబానికి 2500/ అందిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్.పి. పరమేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తదితర అధికారులు హాజరయ్యారు. ఎక్కడా సహాయం అందలేదనే మాట వినిపించకూడదని, అప్రమత్తంగా ఉండి సమస్యలపై వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# కదులుతున్న రైలు నుంచి.. ప్రయాణికుడ్ని తోసేసిన టీటీఈ

పాట్నా, డిసెంబర్ 4: కదులుతున్న రైలు నుంచి ఒక ప్రయాణికుడ్ని టీటీఈ బయటకు తోసేశాడు. దీంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భాతర్ తికులియా గ్రామానికి చెందిన నవల్ ప్రసాద్, కోల్‌కతా వెళ్లేందుకు ఆదివారం ఉజియార్‌పూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. జనరల్ బోగిలో ప్రయాణం కోసం టిక్కెట్ తీసుకున్నాడు. అయితే రాక్సాల్-హౌరా మధ్య నడిచే మిథిలా ఎక్స్‌ప్రెస్‌లోని స్లీపర్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోకి అతడు ఎక్కాడు.

కాగా, ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ) ఆ వ్యక్తిని టికెట్ అడిగాడు. నవల్ ప్రసాద్ వద్ద జనరల్ టికెట్ ఉండటంతో జరిమానా కట్టాలని లేదా స్లీపర్ బోగి నుంచి కిందకు దిగాలని చెప్పాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో ఆ రైలు స్టేషన్ నుంచి కదలడంతో నవల్ ప్రసాద్‌ను టీటీఈ బయటకు తోసేశాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు.

మరోవైపు ఈ విషయం తెలుసుకున్న నవల్ ప్రసాద్ కుటుంబ సభ్యులు తొలుత అతడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పాట్నా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# తిరుమల శ్రీవారి మెట్టుమార్గంలో రాకపోకల నిలిపివేత..!

తిరుపతి, డిసెంబర్ 4:తిరుమల శ్రీవారి మెట్టుమార్గంలో భక్తుల రాకపోకలను తిరుమల తిరుపతి దేవస్థానం నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నది. అలాగే తిరుమలలోని పర్యాటక ప్రదేశాల సందర్శనను తాత్కాలికంగా రద్దు చేసింది. బంగాళాఖాతంలో తీవ్ర తుఫాను ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ మిగ్‌జాం తుఫాను కారణంగా తిరుమల, తిరుపతి పరిసరాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నది. వర్షం నేపథ్యంలో శ్రీవారి మెట్టు మార్గంతో పాటు పాపవినాశనం రోడ్డులోని జాపాలి హనుమాన్ ఆలయం, ఆకాశగంగ తీర్థం, శ్రీవారి పాదాలు, శిలాతోరణంతో పాటు పలు ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శనకు అనుమతిని నిలిపివేసింది. ఆయా మార్గాల్లో చెట్లు విరిగిపడడం, ఎడతెరిపి లేని వర్షం కారణంగా అనుమతిని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు దేవస్థానం అధికారులు వివరించారు.

ఇదిలా ఉండగా.. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తిరుమలలోని ఏఎన్‌సీ కాటేజ్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద భారీగా చెట్లు నేలకొరిగాయి. ఏఎన్సీలో 412 కాటేజ్ దగ్గర ఉన్న భారీ వృక్షం నేలకూలడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు చెట్ల కొమ్మలను తొలగించారు. మరో వైపు కపిలతీర్థం వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో టీటీడీ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. కపిలతీర్థంలో స్నానాలు చేసేందుకు భక్తులకు అనుమతిని నిలిపివేసింది. ఈ మేరకు భక్తులు సహకరించాలని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది.






# తుపాను ఎఫెక్ట్.. విశాఖ నుంచి పలు విమాన సర్వీసులు రద్దు

విశాఖపట్నం, డిసెంబర్ 4:తుపాను ప్రభావం కారణంగా పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లాల్సిన రెండు విమాన సర్వీసులను నిలిపివేసింది.

విశాఖ నుంచి హైదరాబాద్ బయలుదేరాల్సిన రెండు సర్వీసులు, ఒక విజయవాడ సర్వీసును రద్దు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడులోనూ కనిపిస్తోంది. దాంతో కోయంబత్తూరు- చెన్నై మధ్యలో రెండు విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఇండిగో వెల్లడించింది. చాలా విమానాలను చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయానికి మళ్లించారు. ఇప్పటి వరకు దాదాపు 11 విమానాలను దారి మళ్లించినట్లు సమాచారం.

# ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా ముందస్తు చర్యలు..కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



శ్రీకాకుళం, డిసెంబరు 4 : మిచౌంగ్ తుపానుతో జిల్లాలో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. తుపాను హెచ్చరికతో జిల్లాలో తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కి హాజరైన అనంతరం ఆయన ఫ్రంట్ లైన్ అధికారులతో మాట్లాడారు. తుఫాను బాపట్ల జిల్లాపై ప్రభావం చూపే అవకాశముందని, శ్రీకాకుళం జిల్లాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలకు అవకాశముందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సత్వరమే చర్యలు చేపట్టేలా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. వరికోతలు చేయరాదని ముందుగానే హెచ్చరించామని, భారీ వర్షాలు కురిస్తే ఆహార పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇంఛార్జి డీఆర్వో జయదేవి, జిల్లా వ్యవసాయ అధికారి కే.శ్రీధర్, బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాద్, డీఎస్వో వెంకట రమణ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ జయ ప్రకాష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జే.మోహన రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకుడిగా పనిచేస్తా.. ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్, డిసెంబర్ 4: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అర్బన్ ప్రజలకు 24గంటలూ అందుబాటులో ఉంటూ ప్రజా సేవకుడిగా పనిచేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ అర్బన్ లో భారీ మెజారిటీతో బీజేపీని గెలిపించిన ఇందూర్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ లో గల బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మి నరసయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. అధికార పార్టీ, కాంగ్రెస్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఇందూర్ గడ్డ బీజేపీ అడ్డా అని ప్రజలు నిరూపించారన్నారు.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసి.. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభి వృద్ధికి కృషి చేస్తానన్నారు. రోడ్లు, డ్రైనేజీ, ఆసుపత్రులు.. నగరంలోని ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. కేంద్రంలో మూడో సారి మోడీ ప్రభుత్వం వస్తదని ధీమా వ్యక్తం చేశారు.

కేంద్రంలో నాయకులను ఒప్పించి.. అధిక నిధులను తీసుకువచ్చి అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అర్బన్ లో ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ప్రజల చిరకాల వాంఛ అయిన సొంతింటి కలను నెరవేరుస్తానన్నారు. ఇల్లు లేని నిరుపేద మహిళలకు ఇల్లు ఇస్తానన్నారు.

ప్రతి 6 నెలలకు ఒకసారి యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా జాబ్మేళా కార్యక్రమాన్ని చేపడుతానని చెప్పారు. ఈ విజయం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నుంచి కిందిస్థాయి కార్యకర్తల, ప్రతి నాయకుడి విజయమని అందరి కృషితో గెలుపు సాధ్య మైందన్నారు. తన విజయానికి సహకరించిన అర్బన్ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలాం రాజు, ఎర్రం సుధీర్, రోషన్, మధు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాణం ఉన్నంతవరకు ప్రజల పక్షాన పోరాడుతా : మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్



వరంగల్, డిసెంబర్ 4: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని గత రెండు పర్యాయలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించింది. వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో నా వంతు కృషి చేశాను. నా ప్రాణమున్నంత వరకు ప్రజల పక్షాన నిలబడుతానని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చాను. వారిని కాపాడడంలో ముందుంటానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల నిర్ణయాన్ని శిరసావహిస్తూ అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యల పట్ల పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ఎవరూ బాధ పడవద్దు, అధైర్యపడొద్దన్నారు.

రాజకీయంలో గెలుపు, ఓటములు సహజం అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాలలో పాలు పంచుకుంటానని తెలిపారు. మూడు సంవత్సరాలు మేయర్‌గా.. ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ప్రజలు నన్ను ఆశీర్వదించి ముందు తీసుకుపోయినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తా : మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 4: కేసీఆర్, కేటీఆర్ సహకారంతో భూపాలపల్లి నియోజక వర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపాను. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు జీఎంఆర్ ట్రస్టు ద్వారా అనేక సేవలందించాను. ప్రజలు ఊహించని షాక్ ఇచ్చారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆయన సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

2009లోనే భూపాలపల్లి అభివృద్ధికి బలమైన పునాదులు వేశానని తెలిపారు. 2018లో మళ్లీ గెలిచి అభివృద్ధిని అగ్రభాగంలో నిలిపినట్లు పేర్కొన్నారు. ఓటమిపై లోతుగా అధ్యయనం చేస్తాం. కారణాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రజలు ప్రతిపక్ష స్థానంలో కూర్చోబెట్టారు. ప్రతిపక్ష పాత్ర కీలకమైంది. ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు.

# వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తా: బర్రెలక్క

కొల్లాపూర్, డిసెంబర్ 4: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోలేదని, ప్రజల మనసులు గెలిచానని కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేసి ఓడిన శిరీష (బర్రెలక్క) చెప్పారు. స్వతంత్ర్య అభ్యర్థిగా 6 వేల ఓట్లు సాధించడమంటే ప్రజల మనసుల్లో తాను ఉన్నట్లేనని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడానికి తనకు కేవలం ఏడు రోజులే సమయం దొరికిందని, ఈ ఏడు రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లలేకపోయానని తెలిపారు.

అదేవిధంగా తనపై తప్పుడు ప్రచారం జరగడం, తన వయస్సు చిన్నది కావడంతో సరిగా పనిచేయలేనేమోనని ప్రజలు భావించడం, పోలింగ్‌కు ఏడు రోజుల ముందే నామినేషన్ వేసినందున తనను నమ్మేందుకు ప్రజలకు తగినంత సమయం దొరకకపోవడం తన ఓటమికి కారణాలని చెప్పారు. ఎన్నికల ఓడినా నిరుద్యోగుల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు.

కాగా, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం కోసం అంటూ శిరీష (బర్రెలక్క) ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. ఆదివారం వెల్లడైన ఫలితాల్లో ఆమె 5,754 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు 93,609 ఓట్లతో విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డికి 63,678, బీజేపీ అభ్యర్థి అల్లేని సుధాకర్ రావుకు 20,389 ఓట్లు వచ్చాయి.

# జీఎస్టీ వసూళ్లలో రూ.1.66 లక్షల కోట్ల గ్రోత్..
## లోక్ సభలో తేల్చి చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మలమ్మ



న్యూఢిల్లీ, డిసెంబర్ 4:దేశీయంగా 2017 జూలై ఒకటో తేదీ నుంచి పన్నుల వ్యవస్థలో సంస్కరణలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి పెరుగుతూ వచ్చిన జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది సగటున రూ.1.66 లక్షల కోట్ల వసూళు జరుగుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభమైన సందర్భంగా లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు రాతపూర్వక సమాధానమిస్తూ పై సంగతి చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటున ప్రతి నెలా రూ.1.50 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో రూ.1.87 లక్షల కోట్లకు చేరాయన్నారు.

2017 జూలై ఒకటో తేదీ నుంచి ఏయేటికాయేడు జీఎస్టీ వసూళ్లు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.66 లక్షల కోట్ల వద్ద నిలుస్తున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11 శాతం ఎక్కువ అని చెప్పారు.

ఈ ఏడాది సగటున రూ.1.50 లక్షల కోట్ల పై చిలుకు స్థూల జీఎస్టీ వసూళ్లు జరిగితే, 2022-23లో సగటున రూ.1.23 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైందని నిర్మలా సీతారామన్ తెలిపారు. సగటున ప్రతి నెలా జీఎస్టీ వసూళ్లు రూ.94,734 కోట్లు పెరిగాయన్నారు.

కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మరో ప్రశ్నకు సమాధానంగా చెబుతూ 2021-22లో 30 శాతం, 2022-23లో 22 శాతం స్థూల జీఎస్టీ వసూళ్లు పెరిగాయన్నారు. వ్యాపారులు స్వయం మదింపు ప్రకారం జీఎస్టీ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ జీఎస్టీ చెల్లించకున్నా, తక్కువ చెల్లించినా సంబంధిత వ్యాపారులపై చర్య తీసుకునే ధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఉంటుందని స్పష్టం చేశారు.

# అధైర్య పడొద్దు..ప్రజలకు అండగా నిలుద్దాం : మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి




మెదక్, డిసెంబర్ 4:(నేటనిజం ప్రతినిధి): ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రజా తీర్పును శిరసా వహిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో ఎన్నికల ఫలితాలపై మాట్లాడారు. 25 ఏళ్లుగా ఉద్యమంలో రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, అధైర్య పడకుండా ముందుకు సాగినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఆడబిడ్డగా ఆదరించి సహకరించారని అన్నారు.ప్రజలకు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా నిలుస్తూ కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానన్నారు. ఓటమిని గెలుపుగా భావిస్తూ ముందుకు వెలుదామని కార్యకర్తలు, నాయకులు సూచించారు. బీఆర్ఎస్ శ్రేణులు అధైర్య పడకుండా ప్రజలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో శ్రమించిన కార్యకర్తలు, నాయకులకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు బాగుంటేనే ప్రజలూ బాగుంటారు -జగన్



తాడేపల్లి, డిసెంబర్ 4:ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి ఏదైనా ఉద్యోగులకు చేస్తాం. ఉద్యోగులు అనేవారు ప్రభుత్వంలో భాగస్వాములు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని విశ్వసించిన ప్రభుత్వం మనది. మీ మనసులో కష్టం ఉండకుండా చూడాలన్నదే మా ఉద్దేశం అని సీఎం పేర్కొన్నారు.తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం కలిశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, జీపీఎస్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ కమిషన్‌ఏర్పాటు సహా రాష్ట్ర కేబినెట్, ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం మాట్లాడుతూ, "అందుకే పెన్షన్లసహా కొన్ని పరిష్కారాల కోసం రెండేళ్లుగా తపనపడ్డాం. గతంలో ఎవ్వరూ కూడా ఈ సమస్యలకు పరిష్కారం చూపించడానికి తపనపడ్డ సందర్భాలు లేవు. ఉద్యోగులకు పరిష్కారం దొరకాలి, అంతేకాకుండా భావితరాలను కూడా దష్టిలో ఉంచుకోవాలి. దీన్ని దష్టిలో ఉంచుకుని జీపీఎస్ను తీసుకువచ్చాం. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేదిగా జీపీఎస్‌ను రూపొందించాం. 62 ఏళ్లకు రిటైర్ అయితే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలి. అందుకే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచాం" అని చెప్పారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# కొత్త బిల్డింగ్‌లో ప్లకార్డులు వద్దు: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌లో ప్లకార్డులు ప్రదర్శన కుదరదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఇవాళ లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. విపక్షాలు వాయిదా తీర్మానాల గురించి ప్రశ్నించాయి. ఆ సమయంలో కొందరు విపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించారు. సభలో ప్లకార్డులను ప్రదర్శించడాన్ని ప్రభుత్వ తప్పుపట్టింది. బీఎస్పీ ఎంపీ దనిష్ అలీ ప్లకార్డుతో సభలోకి రావడాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తప్పుపట్టారు. వాటిని సభలో నిషేధించినట్లు ఆయన చెప్పారు. ప్లకార్డులతో సభకు రావడం నియమాలకు విరుద్ధమని స్పీకర్ బిర్లా అన్నారు. ప్లకార్డులతో వచ్చిన ఎంపీలు సభను వీడాలని ఆయన కోరారు. కొత్త బిల్డింగ్‌లో సభా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, కొత్త బిల్డింగ్‌లో సభ్యులు ఎవరూ ప్లకార్డులతో రావద్దు అని స్పీకర్ తెలిపారు. అయితే విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టడంతో.. సభను 12 గంటల వరకు వాయిదా వేశారు.సభకు అవమానం జరిగిందన్న ప్లేకార్డును మెడలో వేసుకున్న ఎంపీ దనిష్ అలీ.. లోక్‌సభలోకి ఎంటర్ అయ్యారు. అయితే ఎంపీ మహువా మొయిత్రాపై ఎథిక్స్ కమిటీ ఇచ్చిన రిపోర్టు .. రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్నట్లు చెప్పారు. హౌజ్‌లో దీనిపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఓ సభ్యురాలిపై సుమోటో నోటీసులు ఎలా ఇస్తారని స్పీకర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు.

# యశస్వినీ రెడ్డి గెలుపు కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు-ముద్దసాని సురేష్



మహబూబాబాద్, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గెలుపు కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, మన కష్టం, శ్రమ వృధా కాలేదని అన్నారు.

సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గడచిన పదేళ్లుగా అడుగడుగునా అణచివేతలు, దాడులు, కేసులకు వెవరకుండా కాంగ్రెస్ చేసిన పోరాటంలో మీరంతా ప్రజల పక్షాన నికార్సుగా నిలబడ్డారని కొనియాడారు. మీ కష్టం, శ్రమ వృథా కాలేదని చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణలో మీ అందరి పాత్ర మరువలేనిదని అన్నారు

. ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రంగు మురళి గౌడ్, సీనియర్ నాయకులు తోటకూరి శ్రీనివాస్, దుంపల శ్యామ్, వేముల వెంకన్న,సీతారాం నాయక్, జగ్గు నాయక్, వెంకన్న నాయక్, దంతాలపల్లి రవి,చట్టు యాకన్న, దండుగల ఎల్లయ్య, దాసరి శ్రీనివాస్, కర్ణాకర్ రెడ్డి, అనపురం శ్రీనివాస్, జానీ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సైనిక పాఠశాలలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, ఝాన్సీ, మైన్‌పురిలో ఉన్న మూడు సైనిక్ పాఠశాలలు సహా, గత పద్ధతి ప్రకారం దేశంలో ఏర్పాటు చేసిన మొత్తం 33 సైనిక్ పాఠశాలలు కో-ఎడ్యుకేషన్ విధానంలో ఉన్నాయి. గత పద్ధతి ప్రకారం పూర్తిగా బాలికల సైనిక పాఠశాలల ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో లేదు.

అన్ని రాష్ట్రాలు/యూటీల్లో ఎన్‌జీవోలు/ప్రైవేటు/రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల భాగస్వామ్యంతో 100 కొత్త సైనిక పాఠశాలలు ఏర్పాటు చేసే కార్యక్రమం కింద, పూర్తిగా బాలికల సైనిక పాఠశాలల ఏర్పాటుకు ఎలాంటి పరిమితి లేదు. దీనికి సంబంధించి, ఉత్తరప్రదేశ్‌లోని మథురలోని సంవిద్ గురుకులం సీనియర్ సెకండరీ పాఠశాల పూర్తి బాలికల సైనిక పాఠశాలగా ఆమోదం పొందింది.

రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్, లిఖితపూర్వక సమాధానం రూపంలో ఈ సమాచారాన్ని ఈ రోజు రాజ్యసభలో శ్రీమతి సంగీత యాదవ్‌కు అందించారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, డిసెంబర్ 4: ప్రజల కోసం పనిచేస్తాం. ఒక్క గంట కరంటు ఆగినా వెంటాడుతాం.. వేటాడుతామని మాజీ మంత్రి నిరంజర్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతుబంధు ఇవ్వాలన్నారు. వ్యవసాయం గెలిచినప్పుడు ఎగరలేదు.. ఓడినప్పుడు బాధపడను. నా ఓటమి నన్ను బాధపెట్టలేదు. కానీ, కేసీఆర్ కామారెడ్డిలో ఓడిపోవడం బాగా కలచివేసిందన్నారు.

ప్రధాన మంత్రిగా పోటీ చేసిన ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ఎందరో సీఎం అభ్యర్థులు కూడా ఓడిపోయారని గుర్తు చేశారు. ఓడిపోయానని ఎక్కడికి వెళ్లను.. గ్రామాల్లో తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆచరణ సాధ్యం కానీ హామీలను కాంగ్రెస్ వాళ్లు ఇచ్చారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోయామ అనే విషయం తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారుతున్న కాల్వలు.. పండుతున్న వంట పొలాలు, కనిపిస్తున్న విద్యాసంస్థలు, ఏదుల రిజర్వాయర్, మార్కెట్ యార్డు మమ్మల్ని గుర్తు చేస్తాయి. నన్ను మరిపించడం ఎవరి తరం కాదన్నారు. ఫలితాలను సమీక్షించుకొని ముందుకెళ్తామన్నారు.

# బండి సంజయ్ ముస్లింలపై, ఎంఐఎం పై బురద జల్లడం మానుకోవాలి

**-వక్ఫ్ బోర్డు భూమి అంశంపై..ముస్లింల ఇండ్లు కూల్చినప్పుడు ఎంపీగా ఉండి నువ్వేం చేశావు**

**-రేకుర్తి కూత వేటు దూరంలో ఉన్న బాధిత ముస్లింలను పరామర్శించావా..?**

**-వక్ఫ్ భూమిపై, పేద ముస్లింల ఇండ్లు కూల్చివేత పై బిజెపి మౌనంగా ఎందుకు ఉంది..?**

**-బండి సంజయ్ కు, గులాం అహ్మద్ హుస్సేన్ కౌంటర్..**

కరీంనగర్, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి) ఎమ్మెల్యేగా పోటీ చేసిన ప్రతిసారి ఓడిపోయినప్పుడు బండి సంజయ్ కి ఎంఐఎం పార్టీ తోపాటు, ముస్లింలు గుర్తుకు రావడం వారిపై బురద జల్లడం పరిపాటిగా మారిందని, తన నాలుగున్నర సంవత్సరాల పదవీకాలంలో ఏ ఒక్క రోజైనా ముస్లింల డివిజన్లలో పర్యటించకుండా, అభివృద్ధి పై సందర్శనకు రానటువంటి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు ముస్లింల గురించి, ఎంఐఎంపై మాట్లాడే నైతిక హక్కు లేదని, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. సోమవారం గులాం అహ్మద్ హుస్సేన్ ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ముస్లిం డివిజన్లలో అభివృద్ధిపై ముస్లింలు నివసిస్తున్న బస్తీలు, గ్రామాలపై అభివృద్ధి కోసం ఏ ఒక్క రోజైనా పర్యటించారా..? ముస్లింల సమస్యలను అడిగి తెలుసుకున్నారా..? ముస్లింలు అంటే చిన్న చూపు చూసి, ముస్లింలపై అలసత్వం ప్రదర్శించి, ముస్లింలకు సంబంధించిన నగరాలు, ఊర్ల పేర్లపై వివక్షపూరితంగా వ్యవహరించిన బండి సంజయ్ కు ముస్లింలు అదే రీతిలో బుద్ధి చెప్పారని, బండి సంజయ్ నోటి దురుసుతనంతోనే ఎంఐఎం, ముస్లిం సమాజము ఒక్కటై బిఆర్ఎస్ పార్టీ వైపు నిలిచిందని దుయ్యబట్టారు. కరీంనగర్ నగరంలో హిందువులు నివసించే, ముస్లింలు నివసించే ప్రాంతాల్లో బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్




చేశారు. అందుకే సెక్యులర్ హిందువులు, ముస్లింలు కలిసి బీఆర్ఎస్ కు జైకొట్టారన్నారు. వక్ఫ్ భూమికి సంబంధించిన అంశంపై, రేకుర్తిలో పేద ముస్లింల ఇండ్లు కూల్చివేసినప్పుడు, బాధ్యతాయుతమైనటువంటి పదవిలో బండి సంజయ్ ఎంపీగా ఉండి, రేకుర్తిలో బాధ్యతయుతంగా పర్యటించి, ముస్లింలను ఓదార్చి, నేనున్నానని ధైర్యం కల్పించి, ప్రభుత్వంతో పోరాడి వారి పక్షాన నిలిచి వారికి న్యాయం చేసే ఆలోచన బండి సంజయ్ కి ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

బండి సంజయ్ కార్యాలయానికి, ఆయన నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న రేకుర్తి లో పేద ముస్లింల ఇండ్లు కూల్చి వేసిన సంఘటన వివిధ దినపత్రికల్లో పతాక శీర్షికన వచ్చినప్పటికీ, బిఆర్ఎస్ యేతర పార్టీలు అన్ని ముస్లింల ఇండ్లను కూల్చివేసినప్పుడు ఖండిస్తూ, అక్కడికి వెళ్ళినప్పుడు, బండి సంజయ్ కు కనిపించలేదా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ వక్ఫ్ బోర్డు భూమి అంశంపై, పేద ముస్లింల ఇండ్ల కూల్చివేతపై ఎందుకు మౌనం వహించారో చెప్పాలని విమర్శలు చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కేవలం 40 వేల పైచిలుకు ముస్లింల ఓట్లు పోల్ అయితే, మిగతా 52,000 బీఆర్ ఎస్ కు ఎవరు వేశారు, కాంగ్రెస్కు పోలైనటువంటి 40,000 పైచిలుకు ఓట్లు ఎవరు వేశారో గ్రహించాలని, అవగాహన లేకుండా ముస్లిం సమాజంపై బురద చల్లడమే ధ్యేయంగా బండి సంజయ్ మాట్లాడవద్దని, తన లోపాలను సరిదిద్దుకొని ప్రజల మనసు గెలిచిన నాయకునికి ఎన్నికల్లో విజయం వరిస్తుందని కానీ, ఒక వర్గం మీద ఓడిపోయిన తర్వాత ముస్లింలు, ఓడించారని ఆరోపణలు చేయడం ఎంపీగా బండి సంజయ్ కు భావ్యం కాదని సూచించారు. సెక్యులర్ వాదంతో అన్ని వర్గాల ప్రజలను ప్రజల మన్ననలు పొందినప్పుడే ఏ నాయకుడికైనా విజయం వరిస్తుందని, దాంతోపాటు దైవ నిర్ణయం పై కూడా ఆధారపడి ఉంటుందని బండి సంజయ్ గుర్తుతెరగాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కరీంనగర్ ముస్లిం సమాజంపై ఎంఐఎం పార్టీపై చేసినటువంటి తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఇలాంటి వివక్షపూరితమైన మాటలతో ప్రజలు బుద్ధి చెబుతారని వెల్లడించారు.

# పటేల్ నాయక్‌ను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



మహబూబాబాద్, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని రాజమాన్సింగ్ తండా సర్పంచ్ గుగులోత్ పటేల్ నాయక్ కుమారుడు అనారోగ్యంతో ఇటీవల మరణించగా సోమవారం ఇంటికి వెళ్లి వారిని,కుటుంబ సభ్యులను పరావర్శించారు.పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మ,మండల నాయకులు శ్రీరాం సుదీర్,ఎన్నారై పాకనాటి సునీల్ రెడ్డి,మండల రైతు కోఆర్డినేటర్ పాకనాటి సోమరెడ్డి, సూధగాని మనోహర్,మెట్టు నగేష్,బానోత్ సోమన్న,జాటోత్ కిషన్,విజయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సిఎల్పీ నేత ఎంపికలో కొత్త ట్విస్ట్..అధిష్టానం పిలుపుతో డికె ఢిల్లీకి పయనం..

-సీఎంగా రేంవత్ రెడ్డికి ఇంకా ఓకే చెప్పని కాంగ్రెస్ హైకమాండ్
-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరో డిప్యూటీ సీతక్క అవకాశం..
-సీఎల్పీ తీర్మానానికి ఖర్గే ఆమోదం
-రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం
-జీఏడీకి బాధ్యతల అప్పగింత

హైదరాబాద్, డిసెంబర్ 4:రాజభవన్ లో నేడు జరగాల్సిన కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనూహ్యంగా వాయిదా పడింది.. సిఎల్పీ అధినేతను డిల్లీ పెద్దలు ఖరారు చేయకపోవడంతో ప్రమాణ స్వీకారం నిలిచిపోయింది.. సిఎల్పీ నేత ఎంపిక నిర్ణయాన్ని ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ సిఎల్పీ చేసిన ఏక వాక్య తీర్మానాన్ని నేటి ఉదయం ఢిల్లీకి పంపారు..నేడు అక్కడి ఉంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందని భావించిన కాంగ్రెస్ నేతలు రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారానికి ఏర్పాటు చేయించారు.. అయితే డికె,శివకుమార్ తో సహా తెలంగాణ పరిశీలకులుగా ఉన్న వారందర్నీ తక్షణం ఢిల్లీకి రావాలని పిలుపు రావడతో నేటి కార్యక్రమం వాయిదా పడింది..అధిష్టానం పిలుపుతో డికె, ఇతర నేతలు ఢిల్లీకి పయనమయ్యారు..

ఇది ఇలా ఉంటే తెలంగాణ సీఎంగా బాధ్యతలను స్వీకరించే అవకాశాన్ని రేవంత్‌రెడ్డికే కాంగ్రెస్ పార్టీ అప్పగించినట్టు తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు భట్టి విక్రమార్క, సీతక్క డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం అందుతోంది. అనూహ్యంగా మరో డిప్యూటీ సీఎం పదవికి సీతక్క పేరు వెలువడటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంతోషం నెలకొంది. ఒక దళిత, మరో గిరిజన నేతకు డిప్యూటీ సీఎం హోదా లభించటంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నిజానికి సీతక్కకు గిరిజనశాఖ, లేక హోం మంత్రి పదవి లభిస్తుందని చాలామంది భావించారు. అకస్మాత్తుగా డిప్యూటీ సీఎం పదవికి యోగ్యురాలిగా ఎంపిక చేయటంతో కాంగ్రెస్‌లోని గిరిజన వర్గాలు సంబురపడుతున్నాయి.

సీఎం పదవి ఎవరిని వరిస్తుందనే విషయంలో అందరికీ క్లారిటీ ఉన్నా సోమవారం ఉదయం నుంచి నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వైపే మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. పార్టీ రథసారధిగా.. ఎన్నికల్లో రేవంత్ చూపించిన పోరాట పటిమకు హైకమాండ్ ఫిదా అయిందని, లోక్ సభ ఎన్నికల్లోనూ ఆయన సామర్థ్యాన్ని వినియోగించుకోవాలనే లక్ష్యంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని కీలక నేతలు చెబుతున్నారు. కర్నాటక సీఎం డీకే శివకుమార్ పంపించిన సీల్డ్ కవర్‌ను పరిశీలించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన ఆమోదాన్ని తెలుపుతూ సమాచారం ఇచ్చినట్టు కాంగ్రెస్ కీలక నేతలు మీడియాకు సమాచారం ఇచ్చారు.

### కాంగ్రెస్ శ్రేణుల్లో సంబురాలు..

ఖర్గే పంపిన కబురుతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. హైదరాబాద్ సిటీలో సంబరాలు చేసుకున్నారు. ఇక.. తెలంగాణ తదుపరి సీఎం ప్రమాణ స్వీకారం రాజ్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో సీఎంతో పాటు ఇద్దరు డిప్యూటీ సీఎంలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు జీఏడీ (జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) నుంచి గవర్నర్ కార్యాలయానికి సమాచారం అందింది. కాగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న దర్బార్ హాల్‌లో 300 మంది కూర్చునే వెసులుబాటు కల్పించారు. మిగిలిన ఆహ్వానితులకు ఎక్కడ ఏర్పాట్లు చేయాలనే అంశంపై జీఏడీ అధికారుల కసరత్తు చేస్తున్నారు.

### అందరి ఆమోద యోగ్యంతోనే..

సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ఆమోదించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు లేఖను పంపించారు. ముఖ్యమంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డిని కొనసాగించాలనే తీర్మానాన్ని భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు సహా పది మంది ఎమ్మెల్యేలు ప్రవేశపెట్టారు. ఈ భేటీలో సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ఎన్నుకున్నట్టు ఏకవాక్య తీర్మానం చేసి, అధిష్టానానికి సీల్డ్ కవర్‌లో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పంపించారు. అయతే సాయంకాలానికి పరిస్థితులు వేగంగా మారిపోయాయి.. తెలంగాణ పరిశీలకులు ఢిల్లీకి రావాలని పిలుపు రావడంతో సిఎల్పీ నేత ఎంపికపై కాంగ్రెస్ నేతలలో కొత్త టెన్షన్ ప్రారంభమైంది..

# గులాం అహ్మద్ హుస్సేన్‌తో పాటు టీంను అభినందించిన ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ

-కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితం పై అసదుద్దీన్ ఓవైసీకి వివరించిన ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్
-త్వరలో అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ కరీంనగర్ వస్తామని హామీ



కరీంనగర్, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించడంపై ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యురాలు, ఎంఐఎం కరీంనగర్ టీంను ప్రత్యేకంగా అభినంది ంచి..ఆశీస్సులు అందజేశారు. సోమవారం హైదరాబాద్ లోని ఏఐఎంఐఎం జాతీయ ప్రధాన కార్యాలయం దారుసలాం లో ఎంఐఎం అధినేత భారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీని, ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీని గులాం అహ్మద్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితం పై పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి, గులాం అహ్మద్ హుస్సేన్ పూర్తిస్థాయి అంశాలను వివరించారు. కరీంనగర్లో టీఆర్ఎస్ పార్టీకి ఎంఐఎం పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో మద్దతు పలికి విజయం సాధించడంలో కీలక పాత్రను పోషించడం పట్ల అసదుద్దీన్ ఓవైసీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల అంశాలపై ఇద్దరి మధ్య అరగంటసేపు సీక్రెట్ చర్చ జరిగింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 35 స్థానాల్లో ఎంఐఎం పార్టీని బలోపేతం చేసి, 25 కార్పొరేటర్లు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఆదేశించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ ఇద్దరు కలిసి కరీంనగర్లో పర్యటించనున్నారని గులామ్ అహ్మద్ తెలిపారు. హైదరాబాద్లో ఎంఐఎం పార్టీ తరపున పోటీ చేసి గెలుపొంది నటువంటి ఎంఐఎం పార్టీకి చెందిన 7గురు నూతన ఎమ్మెల్యేలకు గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రెటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజాద్దీన్ ఖాద్రి, ఫసియుద్దీన్ ఖలీద్, షకీల్ తదితరులు ఉన్నారు.

# సింగరేణిలో మోగిన ఎన్నికల నగారా..ఈ నెల 27న గుర్తింపు ఎన్నికలు

కరీంనగర్, డిసెంబర్ 4 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిసి రెండు రోజులు కాకముందే సింగరేణిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి తేదీని ఖరారు చేశారు. సింగరేణిలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలకు సంబంధించి గతంలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్ ప్రక్రియ చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కావడం, సింగరేణి ఎన్నికలను నిర్వహించే పరిస్థితి లేకుండా పోవడంతో అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహించాలని నిర్ణయించారు.

సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్ సింగరేణి ఎన్నికల అధికారి శ్రీనివాసులు సమక్షంలో జరిగిన సమావేశంలో టీబీజీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డితోపాటు జాతీయ సంఘాల నాయకులు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, విప్లవ కార్మిక సంఘాలైన ఐఎఫ్టీయూ, ఇతర సంఘాల నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి ఏకాభిప్రాయానికి రావడంతో 27న ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న కార్మికుల ఓటరు లిస్టును ఎన్నికల అధికారి కార్మిక సంఘాల నాయకులకు అందజేశారు.

# కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ గెలుపు పట్ల హర్షం

-నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ శ్రేణుల ధన్యవాదాలు




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్‌ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపు పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చినందుకు ఋణపడి వుంటామన్నారు. రానున్న రోజుల్లో ఆది శ్రీనివాస్ హయాంలో వేములవాడ అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆది శ్రీనివాస్ కు ఓటేసి గెలిపించిన ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర వెంకటస్వామి, కౌన్సిలర్ బింగి మహేష్ నాయకులు పుల్కం రాజు, పీర్ మహమ్మద్, చికోటి శ్రీహరి, పులి రాంబాబు, కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, ముప్పిడి శ్రీధర్, నేరెళ్ల శ్రీధర్ గౌడ్, వస్తాది కృష్ణ గౌడ్, నాగుల విష్ణు, అక్కన పెల్లి నరేష్, దండుగుల తిరుపతి, ముంజ ఉమేందర్ లు ఉన్నారు.

# ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

-బిజెపి పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు
-ఆది శ్రీనివాస్ కు అభినందనలు
-బిజెపి అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): ఎన్నికల్లో తనపై నమ్మకంతో విశ్వాసంతో ఓటు వేసిన ప్రజలకు, అలాగే తనకోసం ఎన్నికల్లో పనిచేసిన కష్టపడిన కార్యకర్తలకు నాయకులకు ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటానని వేములవాడ బిజెపి అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని కార్యకర్తలు ఎవరు నిరాశ చెందవద్దని, అధైర్య పడవద్దని కోరారు. తనతో పాటు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు శ్రేణులు ఇకముందు కూడా ప్రజాక్షేత్రంలో ప్రతిపక్షంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తము చేసే సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగితాయని, కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండి వారి బాగోగులు చూసుకుంటామని భరోసా ఇచ్చారు. తనకోసం కార్యకర్తలు క్షేత్రస్థాయిలో శక్తివంచన లేకుండా కృషి చేశారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని వికాస్ రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, అన్ని మండల అధ్యక్షులు సర్పంచ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఆది శ్రీనివాస్ కు అభినందనలు తెలిపిన వికాస్ రావు

అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ స్థానం నుండి పోటీ చేసి గెలుపొందిన తన ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కు బిజెపి అభ్యర్థి వికాస్ రావు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు, అలాగే వేములవాడ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రాబోయే ఐదేళ్లలో నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ అంబెడ్కర్ స్టేడియంలో అల్ ఇండియా కరాటే ఛాంపియన్షిప్ (సిఎస్కెఐ) 2023 వారి ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు.

ఈ కరాటే పోటిల్లో కటాస్, కుమ్మితే విభాగాల్లో వేములవాడ పట్టణానికి చెందిన కిడ్స్ కాన్వెంట్ విద్యార్థులు లో లోపు సోఫియా . (5వ తరగతి, నాంపల్లి ) బంగారం, వెండి పతకాలు, ఎస్. ఆర్యనంద్, , (4వ తరగతి)బంగారు, కాంస్య, సిహెచ్ జస్వంత్,(6 వ తరగతి, శాత్రా జ్ పల్లి ) కాంస్య పతకాలను జాతీయ స్థాయిలో అందుకున్నారు.

ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ద రక్షన్ వ సు ఫియా మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు వారి మానసిక ఉల్లాసానికి, ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదపడతాయని తెలిపారు.

ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ అబ్దుల్ మన్నా న్ నుఅభినందించారు. .

# బాధిత కుటుంబానికి డాక్టర్ వికాస్-దీప పరామర్శ



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతి నిధి): డిసెంబర్ 4: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త, 128వ బూత్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి తల్లి కాసరపు అమృతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని డాక్టర్ చెన్నమనేని వికాస్-దీప సోమవారం పరామరి ్శంచారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. వారి వెంట చందుర్తి సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు రాకేష్, గంగరాజు, సాగర్ ఉన్నారు.

# కుమార్తె కళ్ల ముందే తల్లిపై షార్క్ దాడి.. కాలు తినేయడంతో ఆమె మృతి

మెక్సికో సిటీ, డిసెంబర్ 4: కుమార్తె కళ్ల ముందే తల్లిపై షార్క్ దాడి చేసింది. ఆమె కాలును కొరికి తినేసింది. ఈ సంఘటనలో ఆ మహిళ మరణించింది. మెక్సికోలోని మెలాక్ బీచ్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం 26 ఏళ్ల మరియా ఫెర్నాండెజ్ మార్టినెజ్ జిమెనెజ్ అనే మహిళ తన కుమార్తెతో కలిసి బీచ్‌లో ఈత కొట్టింది. ఇంతలో ఒక షార్క్ ఆమెపై దాడి చేసింది. ప్రమాదాన్ని పసిగట్టిన ఆ మహిళ వెంటనే కూతురైన చిన్నారిని రక్షించేందుకు ప్రయత్నించింది. తేలియాడే ఫ్లాట్‌ఫారమ్‌పైకి కుమార్తెను నెట్టింది.

కాగా, మారియా కాలును షార్క్ కొరికి తినేంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె అతికష్టం మీద బీచ్ ఒడ్డుకు చేరుకుంది. అయితే ఆ మహిళకు ఒక కాలు తెగడం చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు. ఎమర్జెన్సీ బృందం వైద్య సేవలందించినప్పటికీ ఫలితం లేకపోయింది. తీవ్ర రక్తస్రావంతో ఆమె చనిపోయింది.

మరోవైపు ఈ విషాద సంఘటనపై బీచ్ అధికారులు స్పందించారు. బీచ్‌లోకి వెళ్లవద్దని సందర్శకులు, స్థానికులను హెచ్చరించారు. బీచ్‌లో జరుగనున్న స్విమ్మింగ్ పోటీలను నిలిపివేశారు. అలాగే షార్క్ దాడి జరిగిన మెలాక్ బీచ్‌తోపాటు సమీపంలోని ఇతర బీచ్‌లను కూడా అధికారులు మూసివేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న 'హాయ్ నాన్న' టీమ్

తిరుపతి, డిసెంబర్ 4:టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హాయ్ నాన్న' . నాని 30గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్నాడు.

ఈ సినిమా డిసెంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

అయితే విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం తిరుపతి వెళ్లిన 'హాయ్ నాన్న టీమ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు నానికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

అనంతరం గర్భాలయంలో స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న 'హాయ్ నాన్న' మూవీలో టాలీవుడ్ భామ సీతారామం ఫేం మృణాళ్ థాకూర్ హీరోయిన్‌గా నటిస్తోండగా.. మలయాళ నటుడు జయరాం కీలక పాత్ర పోషిస్తున్నారు.

అంతకుముందు ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం కడప వెళ్లిన నాని అక్కడ ప్రసిద్ధిగాంచిన పెద్ద దర్గా ను సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆయనకు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# ట్రక్కును ఢీకొట్టిన రాధికపూర్ ఎక్స్‌ప్రెస్.. ఇంజిన్‌లో చెలరేగిన మంటలు..!



న్యూఢిల్లీ, డిసెంబర్ 4: పశ్చిమ బెంగాల్‌లో రాధికపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రక్కును ఢీకొట్టింది. దీంతో రైలు పట్టాలు తప్పింది. ధూలియన్ గంగ, బల్లాల్‌పూర్ స్టేషన్ల మధ్య వేకువ జామున ఒంటిగంట తర్వాత గంటలకు ఈ ఘటన జరిగింది. రైలు పట్టాలు తప్పగా.. ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బోగీల నుంచి ఇంజిన్‌ను వేరు చేసి మంటలను ఆర్పివేశారు. ఘటనకు సంబంధించి ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు.

ఈస్టర్న్ రైల్వే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కౌశిక్ మిత్రా మాట్లాడుతూ ప్రమాదం గురించి తెల్లవారు జామున 1.15 గంటలకు సమాచారం వచ్చింది. ట్రక్కును ఢీకొనడంతో రాధికపూర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందన్నారు. రైలు మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్థలానికి చేరుకొని చేరుకొని మంటలను ఆర్పివేశారన్నారు. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని.. రైలులోని ప్రయాణికులను తరలించేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదం తర్వాత ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.

# పలువురిని పరామర్శించిన డా॥వికాస్ - దీప



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వంగ నవీన్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మరొక యువకుడు గణేష్ ప్రమాదంలో గాయపడ్డారు. వారిరువురిని డా. చెన్నమనేని వికాస్-దీప గార్లు పరామర్శించారు. వారి వెంట చందుర్తి సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు రాకేష్, గంగరాజు, సాగర్ ఉన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.